విలేకరులు కావలెను
పెన్ సత్తా తెలుగు దినపత్రిక
ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.
ఫోన్ నెం : 9885315759

RNI:APTEL/2023/87729

# పెన్ సత్తా

ప్రశ్నించడం అందరి హక్కు...

PEN SATTA Telugu Daily



సంపుటి : 3 సంచిక : 335 ఎడిటర్ : చింతమనేని అనిల్ కుమార్ సోమవారం 27 ఏప్రిల్ 2026 పేజీలు : 08 వెల : 03

Published from Vishakapatnam Circulated by Vijayawada, Ongole, Chittoor, Kadapa, Tirupati. Nandyal, Hyderabad, Ananthapur, Kurnool

# డీజిల్, పెట్రోల్ సరఫరా పెరగాలి

- నిల్వలు లేవన్న బోర్డులు ఎక్కడా కనిపించకూడదు
- 3 రోజుల కిందటే సమస్య గుర్తిస్తే.. చర్యలెందుకు తీసుకోలేదు?
- రైతులకు ఇబ్బందులు రానీయొద్దు
- సమీక్షలో సీఎం చంద్రబాబు
- ఒక్కసారిగా సమస్య తలెత్తడానికి కారణాలపై విచారణకు ఆదేశం



: మూడు రోజుల కిందటే డీజిల్, పెట్రోల్ కొరత తలెత్తుతోందని గుర్తించినా.. పరిస్థితి చక్కదిద్దేందుకు చర్యలెందుకు తీసుకోలేదని అధికారులు, పెట్రోలియం సంస్థల ప్రతినిధులపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్య తలెత్తిన తర్వాత.. ప్రజలు ఇబ్బంది పడే సమయంలో నివేదికలు ఇవ్వడం సరికాదని పేర్కొన్నారు. సోమవారానికి రాష్ట్రంలో డీజిల్, పెట్రోల్ సరఫరా పెరగాలని.. ఏ బంకు వద్దా నోస్టాక్ బోర్డులు కనిపించకూడదని స్పష్టం చేశారు. ఆదివారం ఆయన క్యాంపు కార్యాలయం నుంచి.. అంతకు ముందు ఉదయం ముంబయి నుంచి అమరావతికి బయల్దేరే ముందు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, ఇతర ఉన్నతాధికారులు, పెట్రోలియం సంస్థల ప్రతినిధులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రంలో పెట్రోలు, డీజిల్ కొరతకు కారణాలపై ఆరా తీశారు. 'రాష్ట్రంలో 4,510 బంకులు ఉండగా.. కొరత కారణంగా 421 మూతపడ్డాయి. ఇంధన సరఫరా గతంలో కంటే పెరిగినా.. దొరకదేమోనన్న ఆందోళనతో వినియోగదారులు ఎక్కువగా

- మిగతా 2లో



## పెంచలకోన బ్రహ్మోత్సవాలకు సీఎం చంద్రబాబుకు ఆహ్వానం

- సీఎంను కలిసి ఆహ్వాన పత్రిక అందించిన ఎమ్మెల్యే కురుగొండ్ల
- ఈనెల 27 నుంచి మే 3 వరకు జరగనున్న ఉత్సవాలు
- ముఖ్యమంత్రికి స్వామివారి ప్రసాదాన్ని, ఆశీర్వచనం అందించిన అర్చకులు
- ఉత్సవాల ఏర్పాట్లపై ఆరా తీసిన ముఖ్యమంత్రి చంద్రబాబు

ముఖ్యమంత్రి చంద్రబాబును నెల్లూరు జిల్లా పెంచలకోన శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలకు హాజరుకావాల్సిందిగా ప్రత్యేకంగా ఆహ్వానించారు. నెల్లూరు జిల్లాకు చెందిన ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, ఆలయ

- మిగతా 2లో



## ఇంధన పాట్లు.. ఇంతింత కాదయా

- డీజిల్, పెట్రోల్ కోసం హాహాకారాలు
- సగానికి పైగా బంకుల మూత
- రాష్ట్రంలో మునుపెన్నడూ లేని పరిస్థితి
- డబ్బాలతో రాత్రిళ్లు నిరీక్షిస్తున్న రైతులు
- మంగళవారం వరకు ఇదే పరిస్థితి కొనసాగే అవకాశం

రాష్ట్రంలో డీజిల్, పెట్రోలు కొరతతో వాహనదారులు గగ్గోలు పెడుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 4,500 పైగా బంకుల్లో సగానికి పైగా మూతపడ్డాయి. చాలా బంకుల వద్ద నో స్టాక్ బోర్డులు, భారీగా బారులు తీరిన వాహనాలే కన్పిస్తున్నాయి. దూర ప్రాంతాలకు బయల్దేరిన ఎందరో..

- మిగతా 2లో

## ఏపీలో డీజిల్, పెట్రోల్ కొరత లేదు



అమరావతి: ఏపీలో డీజిల్, పెట్రోల్ కొరత లేదని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. సరఫరాలో వచ్చిన లోపాల వల్లే బంకులు మూతపడుతున్నాయని స్పష్టం చేశారు. ఇంధనానికి లోటు లేదని.. ఆందోళన అవసరం లేదని పేర్కొన్నారు. సమాచార, ప్రసార మాధ్యమాల్లో ఎప్పటికప్పుడు వివరాలు

- మిగతా 2లో



## కోర్టులు పెరిగితే.. ప్రజలకు సత్వర న్యాయం

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్

ప్రభుత్వం 90 కోర్టులు మంజూరు చేసినట్లు వెల్లడి

విజయవాడలో కొత్తగా ఐదు న్యాయస్థానాలు ప్రారంభం

- మిగతా 2లో



## దిగ్బంధనం తొలగించాల్సిందే

అప్పటిదాకా అమెరికాతో చర్చలుండవ్: ఇరాన్ అధ్యక్షుడు

- మిగతా 2లో



## జనగణనలో పౌరులంతా పాల్గొనాలి

'మన్ కీ బాత్'లో మోదీ విజ్ఞప్తి

ఢిల్లీ: జన గణన ప్రభుత్వానికి సంబంధించిన కార్యక్రమం మాత్రమే కాదని, ఇందులో పాల్గొనడం

- మిగతా 2లో



## కొలంబియాలో ఉగ్రదాడి

### బస్సులో బాంబు పేలి 13 మంది మృతి

బొగోటా: కొలంబియా నైరుతి ప్రాంతంలో శనివారం ఓ బస్సుపై జరిగిన బాంబు దాడిలో 13 మంది దుర్మరణం పాలయ్యారు. ఐదుగురు చిన్నారులు సహా 38 మంది గాయపడ్డారు. ఇది ఉగ్రవాద చర్యని, కొలంబియాలో మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ ఇవాన్ మోర్డిస్కో అనుచరులు ఈ దుశ్చర్యకు పాల్పడ్డారని సైన్యాధిపతి ఆరోపించారు. ప్రభుత్వ మౌలిక సదుపాయాలే లక్ష్యంగా ఈ ప్రాంతంలో రెండ్రోజుల్లో మొత్తం 26 దాడులు జరిగాయని, వీటివల్ల ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారని ఆయన వెల్లడించారు. ఈ ప్రాంతంలో మాదక ద్రవ్యాల అక్రమ రవాణాకు సంబంధించి హింస తీవ్రమవుతున్న తరుణంలో తాజా ఘటన తీవ్ర కలకలం రేపింది.

**ఐర్లాండ్‌లో బాంబు పేలుడు**

లండన్: ఐర్లాండ్ ఉత్తర ప్రాంతంలోని బెల్ఫాస్ట్‌లో ఉన్న ఓ పోలీసుస్టేషను

- మిగతా 2లో

## ట్రంప్ విందులో పేలిన తుపాకీ

- శ్వేత సౌధ విలేకరుల డిన్నర్ జరుగుతున్న హోటల్‌లోకి దూసుకొచ్చిన దుండగుడు
- భద్రతా సిబ్బందిపైకి కాల్పులు
- వెంటనే అప్రమత్తమైన సీక్రెట్ ఏజెంట్లు
- విందు జరుగుతున్న బాల్‌రూంలోకి వెళ్లకుండా అడ్డుకోవడంతో తప్పిన ముప్పు
- సురక్షితంగా బయటపడ్డ అధ్యక్ష, ఉపాధ్యక్షులు
- ఘటనాస్థలిలోనే అదుపులోకి నిందితుడు
- రెండేళ్లలో ఇలాంటిది మూడోసారి
- దాడి యత్నాన్ని ఖండించిన మోదీ, ప్రపంచ దేశాల నేతలు



వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై మరోసారి హత్యాయత్నం జరిగింది. భద్రతా సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించడంతో త్రుటిలో ఆయన, సతీమణి మెలనియా, ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ దంపతులు ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. తుపాకులు, కత్తులతో వచ్చిన ఆగంతుకుడు 'శ్వేతసౌధం విలేకరుల సంఘం' విందు జరుగుతున్న హోటల్‌లోని బాల్‌రూంవైపు వెళ్తూ కాల్పులకు

- మిగతా 2లో



## స్వీయ జనగణన షురూ

- అందరూ పాల్గొనాలని రాష్ట్ర ప్రజలకు గవర్నర్, సీఎం పిలుపు
- కుటుంబ వివరాలు నమోదు చేసిన శివప్రతాప్ శుక్లా, రేవంత్‌రెడ్డి
- వివరాలు ఇస్తే పథకాలు రావనే అపోహ వద్దన్న కిషన్‌రెడ్డి

జనగణనలో భాగంగా 'స్వీయ నమోదు' కార్యక్రమం రాష్ట్రంలో ప్రారంభమైనందున అందరూ స్వచ్ఛందంగా వారి వివరాలను నమోదు చేయాలని గవర్నర్ శివప్రతాప్ శుక్లా, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభమైన స్వీయ నమోదు కార్యక్రమంలో వారితోపాటు శాసనమండలి

- మిగతా 2లో

# డీజిల్, పెట్రోల్ సరఫరా పెరగాలి

-మొదటిపేజీ తరువాయి

కొనుగోలు చేస్తున్నారు. దీంతో కొన్ని బంకుల్లో నిల్వలు నిండుకుంటున్నాయి' అని అధికారులు సీఎంకు వివరించారు. రిటెయిల్ ఔట్‌లెట్ల వద్ద వాణిజ్య వినియోగదారులు కొనుగోళ్లు చేయడంతో కొరత పరిస్థితి తలెత్తిందని.. ఇంధన కంపెనీల ప్రతినిధులు తెలిపారు. సాధారణ వినియోగంతో పోలిస్తే.. శనివారం పెట్రోలు 34%, డీజిల్‌కు 16% చొప్పున డిమాండు పెరిగిందని.. ఆదివారం కూడా 22% డిమాండు నెలకొందని వెల్లడించారు. నయారా, రిలయన్స్ జియో తదితర ప్రైవేటు ఆపరేటర్లు కూడా తమ కంపెనీల బంకులకు సరఫరా నిలిపివేయడంతో సమస్య తీవ్రమైందని పేర్కొన్నారు. ఇంధన కొరత సమస్య ఒక్కసారిగా తలెత్తడానికి దారితీసిన కారణాలపై విచారణ చేయాలని సీఎం ఆదేశించారు.

**ప్రత్యేక టాస్క్‌ఫోర్స్, కంట్రోల్ రూమ్**

సాధారణ పరిస్థితులు నెలకొనే వరకు రెవెన్యూ, పోలీసు, తూనికలు కొలతల శాఖ విభాగాలతో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్, కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఆక్వా రైతులు, వరికోత యంత్రాలకు డీజిల్ కొరత రాకూడదని.. కూపన్ విధానం ప్రవేశపెట్టే ఆలోచన చేయాలని కలెక్టర్లు, వ్యవసాయ అధికారులకు సూచించారు. రిటెయిల్ ఔట్‌లెట్లకు గతంలో ఇచ్చినట్లు క్రెడిట్ ఎందుకు ఇవ్వడం లేదని ఇండియన్ ఆయిల్, హిందుస్థాన్ పెట్రోలియం, భారత్ పెట్రోలియం సంస్థల ప్రతినిధుల్ని చంద్రబాబు ప్రశ్నించారు. కంపెనీలు, రిటెయిల్ ఔట్‌లెట్ల మధ్య అంతరం లేకుండా చూసుకోవాలని సూచించారు. ప్రజల్ని, ప్రభుత్వాన్ని ఉద్దేశపూర్వకంగా ఇబ్బంది పెట్టాలని చూస్తే అనుమతులపై పునరాలోచన చేస్తామని హెచ్చరించారు. ఆయిల్ కంపెనీల అసంబద్ధ నిర్ణయాల కారణంగా ప్రజలు ఇబ్బంది పడితే సహించేది లేదన్నారు. నిత్యావసరాలకు సంబంధించిన వ్యవహారంలో బాధ్యత లేకుండా వ్యవహరిస్తే ఉపేక్షించబోమని స్పష్టం చేశారు.

# ఇంధన పాట్లు.. ఇంతింత కాదయా

-మొదటిపేజీ తరువాయి

దారిలో ఇంధనం అయిపోయి తిరిగి పోయించుకునే వీల్లేక పిల్లలు, వృద్ధులతో రహదారులపై చిక్కుకుపోయారు. మూడు రోజుల కిందటే సమస్య ఉత్పన్నం కాగా, పౌరసరఫరాల శాఖ ఉన్నతాధికారులు సీరియస్‌గా తీసుకోకపోవడంతో ఇప్పుడు తీవ్రరూపం దాల్చింది. వరికోత యంత్రాలకు, ఆక్వా చెరువుల్లో ఏరియేటర్లు తిప్పేందుకు డీజిల్ కోసం రైతులు రాత్రిళ్లు సైతం పడిగాపులు పడుతున్నారు. పొలం నుంచి పంట తెచ్చుకోవాలన్నా, మార్కెట్‌కు తరలించాలన్నా.. రైతులకు వాహనాలు దొరకడం లేదు. ట్రావెల్ బస్సులు, రవాణా వాహనాలు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చేటప్పుడే ఫుల్‌ట్యాంక్ చేయించుకుని వస్తున్నాయి.

**ఒక్కో జిల్లాలో వందల కొద్దీ బంకుల మూత**

రాష్ట్రవ్యాప్తంగా 4,510 బంకులు ఉంటే.. వాటిలో 421 మూత పడినట్లు ఇంధన సంస్థలు, పౌరసరఫరాల శాఖ అధికారులు లెక్కలు చెబుతున్నారు. వాస్తవానికి ఒక్కో జిల్లాలో మూడో వంతు బంకుల్లో డీజిల్ నిల్వలు నిండుకోగా, 10–20 బంకుల్లో పెట్రోలు కొరత కూడా నెలకొంది. ఉదాహరణకు గుంటూరు జిల్లాలో 70, పల్నాడు జిల్లాలో 61, బాపట్ల జిల్లాలో 15 బంకుల్లో డీజిల్ లేదని అక్కడి అధికారులే ప్రకటించారు. క్షేత్రస్థాయిలో ఇంకా ఎక్కువే ఉంటాయి. అనకాపల్లి జిల్లా పరిధిలో జాతీయ రహదారికి అనుకుని ఉన్న 80% బంకుల్లో డీజిల్ లేదు. ఉమ్మడి కడప జిల్లాలోనూ సమస్య ఉంది. తిరుపతిలో 30% బంకులు మూతపడ్డాయి. తిరుమలలోనూ డీజిల్ లేదు. విశాఖలో కొన్నిచోట్ల పెట్రోలు కొరత ఏర్పడింది.

నంద్యాల జిల్లా శిరివెళ్లలో వరికోత యంత్రాలు, ట్రాక్టర్లకు డీజిల్ కోసం బంకు వద్ద అన్నదాతల నిరీక్షణ

**దెబ్బతిన్న సరఫరా వ్యవస్థ**

పశ్చిమాసియాలో యుద్ధం నేపథ్యంలో ముడిచమురు ధరలు పెరగడంతో ఇంధన సంస్థలకు నష్టాలు పెరిగాయి. దీంతో అమ్మకాలు కుదించుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి. ప్రభుత్వ రంగంలోని పెట్రోలియం సంస్థల ఆధ్వర్యంలోని ఔట్‌లెట్ల ద్వారా అధికశాతం అమ్మకాలు జరుగుతాయి. వీటిలో ఓ సంస్థ గత నెలలో అధికంగానే సరఫరా చేసినా.. ఏప్రిల్ రెండో వారం నుంచి తగ్గించింది. దీంతో మరో రెండు సంస్థలకు చెందిన ఔట్‌లెట్లపై ఆ ప్రభావం పడింది. సరఫరా వ్యవస్థ దెబ్బతింది. కొన్ని ఔట్‌లెట్లలో బల్క్ వినియోగదారులకు మళ్లిస్తుండటమూ సమస్యకు కారణంగా నిలుస్తోంది. ఆదివారం కొన్నిచోట్ల అధికారులు తనిఖీలకు వెళ్లినప్పుడు నిల్వలున్నా.. పంపిణీ చేయడం లేదనే విషయం వెల్లడైంది. సాధారణంగా రోజుకు పెట్రోల్ 6,330 కిలోలీటర్లు, డీజిల్ 9,048 కిలోలీటర్ల అమ్మకాలు జరుగుతాయి. కానీ, శనివారం 10,345 కిలోలీటర్ల పెట్రోల్, 14,156 కిలోలీటర్ల డీజిల్ సరఫరా చేశామని పెట్రోలియం సంస్థలు నివేదికలిచ్చాయి. అప్పటికీ సమస్య తీరకపోగా, మరింత పెరగడానికి ఇంధన మళ్లింపు కారణమని పేర్కొంటున్నారు. పారిశ్రామిక వినియోగానికి సరఫరా చేసే డీజిల్ ధర లీటరు రూ.152 అయింది. దీంతో ఆయా సంస్థలు కూడా ఔట్‌లెట్ల నుంచి కొనుగోలు చేస్తున్నాయి.

**ఇండెంట్‌కు అనుగుణంగా సరఫరా లేదు**

ఇండెంట్‌కు అనుగుణంగా సరఫరా చేయకపోవడం వల్లే సమస్య ఎదురవుతోందని బంకుల డీలర్లు పేర్కొంటున్నారు. గతేడాది అమ్మకాలతో పోలిస్తే పెట్రోలు 15%, డీజిల్ 25% అధికంగా సరఫరా చేశామని ఇంధన సంస్థలు చెబుతున్నా.. అంత చేయలేదని డీలర్లు చెబుతున్నారు. కొరత నేపథ్యంలో ఫుల్‌ట్యాంక్ చేయించేందుకు వాహనదారులు ప్రయత్నిస్తున్నారు. దీంతో డీలర్లు డీజిల్, పెట్రోల్ పంపిణీకి పరిమితులు పెట్టారు.

**తిరుమలలో మూతపడిన పెట్రోల్ బంకు వద్ద నో స్టాక్ బోర్డు**

**వేసవిలో ఫుల్ ట్యాంక్ వద్దు!**

ఇంధన కొరత భయంతో పెట్రోల్ బంకుల వద్ద భారీగా వరుసలు కడుతున్న వాహనదారులు.. ఆయిల్ ట్యాంక్ నిండా ఇంధనాన్ని (ఫుల్‌ట్యాంక్) నింపుతున్నారు. ప్రస్తుతం మండుతున్న ఎండల దృష్ట్యా అది ప్రమాదకరమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ట్యాంకు నిండుగా ఉన్నప్పుడు ఎండ వేడిమికి ఇంధనం వ్యాకోచిస్తుంది. లోపల ఖాళీ లేకపోతే.. ఒత్తిడి పెరిగి ఆవిరి రూపంలో బయటకు వెళ్లిపోతుంది. ట్యాంక్‌కు చిన్నపాటి లీకేజీ ఉన్నా.. అగ్ని ప్రమాదాలకు ఆస్కారం ఏర్పడుతుంది. వాహన తయారీ సంస్థలు పెట్రోల్ ట్యాంకులను డిజైన్ చేసేటప్పుడు, ఇంధనం వ్యాకోచించడానికి కొంత ఖాళీ వదిలి పెడతాయి. ట్యాంక్ సామర్థ్యం కంటే ఎక్కువగా, ఆటో–కట్ అయిన తరువాత కూడా నింపడం వల్ల లోపలి 'ఎయిర్ లాక్' వ్యవస్థ దెబ్బతింటుంది. ట్యాంకు ఫుల్‌గా ఉన్నప్పుడు కలిగే అధిక ఒత్తిడి కారణంగా కార్బ్యురేటర్, ఫ్యూయల్ ఇంజెక్షన్ సిస్టమ్‌పై ప్రభావం చూపి, వాహనం ఆగిపోవడానికి, స్టార్టింగ్ సమస్యలకు కారణమవుతుందని నిపుణులు చెబుతున్నారు.

# ట్రంప్ విందులో పేలిన తుపాకీ

-మొదటిపేజీ తరువాయి

దిగడంతో ఒక్కసారిగా భీతావహ వాతావరణం నెలకొంది. ట్రంప్‌ను రక్షించడానికి సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లు ఆగమేఘాలపై స్పందించగా.. కాల్పుల చప్పుళ్లు వినగానే ప్రాణభయంతో పలువురు అతిథులు టేబుళ్ల కింద దాక్కోవాల్సి వచ్చింది. నిందితుడు కోల్ టొమాస్ అలెన్‌ను (31) అక్కడికక్కడే నిర్బంధంలో తీసుకుని సంకెళ్లు వేశారు. అతడి వద్ద ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. శనివారం రాత్రి జరిగిన ఈ ఘటనలో అందరూ సురక్షితంగా బయటపడ్డారు. ఘటన తర్వాత కూడా విందు కొనసాగించాలని ట్రంప్ గట్టిగా భావించినా.. భద్రతాధికారులు ఆ ప్రాంగణాన్ని తక్షణం ఖాళీ చేయడమే మేలని సూచించి ఆయనను శ్వేతసౌధానికి తరలించారు. ట్రంప్‌పై దాడికి ప్రయత్నించడం రెండేళ్లలో ఇది మూడోసారి.

**ఏం జరిగిందంటే..**

వైట్‌హౌస్ కరస్పాండెంట్స్ అసోసియేషన్'(డబ్ల్యూహెచ్‌సీఏ) ఏడాదికి ఒకసారి విందు సమావేశాన్ని నిర్వహిస్తుంటుంది. శ్వేతసౌధానికి సంబంధించిన వార్తలు రాసే పాత్రికేయులు తమ వృత్తి గౌరవార్థం ఇచ్చే ఈ విందుకు అధ్యక్షుడు హాజరై మాట్లాడటం పరిపాటి. అందులో భాగంగా శ్వేతసౌధానికి మైలు దూరంలోని 'వాషింగ్టన్ హిల్టన్' హోటల్లో శనివారం రాత్రి విందు జరుగుతున్నప్పుడు 8.34 గంటల సమయంలో కాల్పుల కలకలం చోటుచేసుకుంది. హాల్ బయట కలకలాన్ని గుర్తించి ట్రంప్ దంపతుల చుట్టూ భద్రతాధికారులు వలయంగా ఏర్పడి వేదిక వద్ద నుంచి తరలించారు. వేదిక నుంచి ట్రంప్ దిగుతూ కొంత తడబడగా సిబ్బంది చేయూతనిచ్చారు. ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్, ఉష దంపతులనూ సిబ్బంది బయటకు తీసుకెళ్లారు.

**నిందితుడి బస అదే హోటల్లో..**

కాలిఫోర్నియాలోని టొరాన్స్‌కు చెందిన నిందితుడు అలెన్ అదే హోటల్లో బస చేశాడని అధికారులు గుర్తించారు. అతడు మెకానికల్ ఇంజినీరింగ్ చేసి, ఆ తర్వాత కంప్యూటర్ సైన్స్‌లో మాస్టర్స్ పూర్తి చేసిన ప్రోగ్రామర్. కొత్తకొత్త సాంకేతికతలు కనిపెట్టేవాడు. గతంలో డెమోక్రటిక్ పార్టీకి కొద్దిపాటి విరాళం ఇచ్చాడు. ఒక విద్యాసంస్థలో ఆరేళ్లు పనిచేసినట్లు సామాజిక మాధ్యమ ప్రొఫైల్ చెబుతోంది. ఘటన వెనుక అతనొక్కడే ఉన్నాడని భావిస్తున్నారు. ఆయుధాలను గత రెండేళ్లలో సమీకరించుకున్నాడని, ట్రంప్ విధానాలను వ్యతిరేకిస్తూ అధికార యంత్రాంగంలో కొందరిపై గురిపెట్టినట్లు సామాజిక మాధ్యమాల్లోనూ చెప్పేవాడని తెలుస్తోంది. మాదకద్రవ్యాల పడవలపై దాడులు సహా అనేక అంశాలను తప్పుబట్టాడు. అతని కుటుంబసభ్యులు కనెక్టికట్ పోలీసులను ముందే అప్రమత్తం చేశారని ట్రంప్ వెల్లడించారు.

**వేల మంది ఉండగా..**

డబ్ల్యూహెచ్‌సీఏ విందుకు అతిథులుగా కొన్ని వేల మంది హాజరయ్యారు. ఇది మొదలైన కొన్ని నిమిషాల్లోనే తీవ్ర కలకలం రేగింది. అధ్యక్షుడు, సీనియర్ అధికారులు, వివిధ రంగాల ప్రముఖులున్న హాల్ వద్దకు వెళ్లే క్రమంలో లాబీలోకి మారణాయుధాలతో దుండగుడు చొరబడ్డాడు. బారికేడ్లను దాటుకుని వేగంగా అలెన్ వస్తుండగా సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లు అతడివైపు పరుగుతీయడం, ఆ ప్రయత్నంలో ఒక అధికారిపై కాల్పులు జరగడం గురించి ట్రంప్ ఒక వీడియో విడుదల చేశారు. గాయపడ్డ అధికారి కోలుకుంటున్నారు. ప్రమాదం గురించి తెలియగానే పాత్రికేయులు ఫోన్లో తాజా కబురును తమ మీడియాకు చేరవేయడంలో తలమునకలయ్యారు.సందట్లో సడేమియా అన్నట్లు కొందరు అతిథులు ఖరీదైన మద్యం సీసాలను ఎత్తుకుపోయారు. సమావేశంలో పాల్గొన్న రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్, విదేశాంగ మంత్రి మార్కో రుబియో, హౌస్ స్పీకర్ మైక్ జాన్సన్, డెమోక్రటిక్ పక్ష నేత హకీమ్ జెఫ్రీస్ తదితరులు ఘటనను ఖండించారు.

**ప్రభావవంతుల వెనుకే పడతారు: ట్రంప్**

తాను ఒంటరినని నిందితుడు భావించి ఉంటాడని.. ఘటన జరిగిన రెండు గంటల తర్వాత ట్రంప్ వ్యాఖ్యానించారు. ప్రభావవంతులైన వ్యక్తుల వెనుక ఇలాంటివారు పడుతుంటారని చెప్పారు. శ్వేతసౌధంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. చూడటానికి బాగున్న నిందితుడు అలా ఎందుకు చేశాడో తెలియడం లేదన్నారు. తాను ప్రమాదకరమైన విధుల్లో ఉన్నట్లు భార్యకూడా పలుమార్లు చెప్పిందని, నిజానికి అది ఇద్దరికీ వర్తిస్తుందని అన్నారు. శ్వేతసౌధంలోనే అత్యంత భద్రతతో బాల్‌రూం ఏర్పాటుచేయాల్సిన ఆవశ్యకతను తాజా ఘటన చాటిచెప్పిందన్నారు. ఇప్పటికే ఇది నిర్మాణంలో ఉందని గుర్తుచేశారు.

# ఏపీలో డీజిల్, పెట్రోల్ కొరత లేదు

-మొదటిపేజీ తరువాయి

తెలపాలని అధికారులకు సూచించారు. క్షేత్రస్థాయిలో ఎలాంటి సమస్య వచ్చినా వెంటనే పరిష్కరించుకోవాలన్నారు. పలు చోట్ల కొందరు వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టిస్తున్నారని.. బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సరఫరా చైన్ దెబ్బతినకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను కోరారు. ఆయిల్ డిపోలను జిల్లా అధికారులు నిత్యం పరిశీలించాలన్నారు. ప్రైవేట్ ఆయిల్ కంపెనీల డిపోలు, అవుట్‌లెట్‌లనూ తనిఖీ చేయాలని ఆదేశించారు. బంక్‌ల వద్ద గొడవలు జరగకుండా పోలీసులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు.

కొన్ని ఏజెన్సీలు కృత్రిమ కొరత సృష్టిస్తున్నాయని ఎంపీ పురందేశ్వరి అన్నారు. అనవసరంగా పెట్రోల్ కొరత వాతావరణం కలిపిస్తున్నాయని పేర్కొన్నారు. ఎక్కడికక్కడ నిఘా పెంచాలని.. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. పెట్రోల్ బంకుల్లో ఆకస్మిక తనిఖీలు జరపాలని సూచించారు.

# కొలంబియాలో ఉగ్రదాడి

-మొదటిపేజీ తరువాయి

వెలుపల కారులో బాంబు పేలిన ఘటన కలకలం సృష్టించింది. డన్‌మ్రీ ప్రాంతంలో శనివారం రాత్రి దుండగులు ఓ డెలివరీ వాహనాన్ని అడ్డుకొని దానిలో సిలిండర్ బాంబు పెట్టారు. కారును పోలీసుస్టేషను వద్ద వదిలేయాల్సిందిగా డ్రైవరును బెదిరించారు. దీన్ని గుర్తించి అప్రమత్తమైన పోలీసులు.. ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించే సమయంలో బాంబు పేలింది. ఈ ఘటనలో ఎవరూ గాయపడలేదని అధికారులు తెలిపారు. ప్రజలను హతమార్చి తీవ్ర నష్టం కలిగించేందుకే రద్దీ ప్రాంతంలో దాడికి పాల్పడ్డారని వెల్లడించారు. 1998లో శాంతి ఒప్పందంతో మత హింస ముగిసినప్పటికీ పోలీసులే లక్ష్యంగా ఈ ప్రాంతంలో ఉగ్రవాద గ్రూపులు దాడులు జరుపుతూనే ఉన్నాయి.

# కోర్టులు పెరిగితే..

# ప్రజలకు సత్వర న్యాయం

న్యాయస్థానాల సంఖ్య పెరిగితే.. ప్రజలకు సత్వర న్యాయం అందే అవకాశం ఎక్కువగా ఉంటుందని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్ పేర్కొన్నారు. కేసులను సత్వరమే పరిష్కరించేందుకు తాము కృషి చేస్తున్నామన్నారు. విజయవాడకు కొత్తగా మంజూరైన 7, 8, 9, 10, 11వ అడిషనల్ చీఫ్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కమ్ అడిషనల్ సివిల్‌జడ్జి కోర్టులను హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బట్టు దేవానంద్, జస్టిస్ వి.గోపాలకృష్ణారావులతో కలిసి జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనాభా ఆధారంగా.. పెండింగులో ఉన్న కేసులను దృష్టిలో పెట్టుకొని ఓ నివేదికను తయారు చేసి ప్రభుత్వానికి సమర్పించగా, ప్రభుత్వం సానుకూలంగా స్పందించి రాష్ట్ర వ్యాప్తంగా 90 కోర్టులు మంజూరు చేసినట్లు తెలిపారు. 'ఉమ్మడి కృష్ణా జిల్లాకు 10 కోర్టులు కేటాయించగా.. విజయవాడలో ఐదు, గుడివాడ, కైకలూరు, తిరువూరు, మైలవరం, నూజివీడులో ఒక్కోటి చొప్పున ఏర్పాటు కానున్నాయి. తొలుత విజయవాడలో కోర్టులను ప్రారంభించాం' అని తెలిపారు. విజయవాడ న్యాయస్థానాల ప్రాంగణంలో పార్కింగ్, లిఫ్ట్ సమస్యలు ఉన్నాయంటూ జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్ దృష్టికి సిబ్బంది తీసుకురాగా.. సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి గుట్టల గోపి, రెండో అదనపు జిల్లా జడ్జి ఎ.సత్యానంద్, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు చలసాని అజయ్‌కుమార్, బెజవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు విష్ణుబొట్ల లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి వి.జి.కిరణ్, బీబీఏ ఉపాధ్యక్షుడు బి.లెనిన్ పాల్గొన్నారు.

# పెంచలకోన బ్రహ్మోత్సవాలకు సీఎం చంద్రబాబుకు ఆహ్వానం

-మొదటిపేజీ తరువాయి

పాలకమండలి ఛైర్మన్ తిరుపాల్ రెడ్డి సోమవారం సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రిని కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు.ఈ సందర్భంగా, ఈ నెల 27 నుంచి మే 3వ తేదీ వరకు వైభవంగా జరగనున్న పెంచలకోన శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలకు తప్పనిసరిగా రావాలని వారు ముఖ్యమంత్రిని కోరారు. వారి వెంట వచ్చిన ఆలయ అర్చకులు ముఖ్యమంత్రి చంద్రబాబుకు వేదాశీర్వచనం అందించి, స్వామివారి తీర్థ ప్రసాదాలతో పాటు చిత్రపటాన్ని బహూకరించారు.ఆహ్వానాన్ని స్వీకరించిన అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు, బ్రహ్మోత్సవాల ఏర్పాట్ల గురించి ఎమ్మెల్యేను, ఆలయ ఛైర్మన్‌ను అడిగి తెలుసుకున్నారు. ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని ఆయన సూచించినట్లు తెలిసింది. ఈ కార్యక్రమంలో పలువురు స్థానిక నేతలు పాల్గొన్నారు.

## స్వీయ జనగణన షురూ

-మొదటిపేజీ తరువాయి

ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు కూడా పాల్గొన్నారు. వారి ఇళ్లకు రాష్ట్ర జనాభా లెక్కల విభాగం సంచాలకురాలు భారతి హొళికెరి, ఇతర అధికారులు వెళ్లి స్వీయ నమోదు ప్రక్రియను తెలియజేసి వారి వివరాలను నమోదు చేశారు. సెన్సస్ వెబ్‌సైట్ ద్వారా తమ వివరాలను గవర్నర్, సీఎం, సీఎస్, మండలి ఛైర్మన్ నమోదు చేసుకున్నారు.

**వనరుల సమాన పంపిణీకి పునాది: గవర్నర్**

లోక్‌భవన్‌లో గవర్నర్ శివప్రతాప్‌శుక్లా ఆన్‌లైన్‌లో స్వీయ నమోదు చేసిన తర్వాత మాట్లాడుతూ "జనాభా గణన అనేది కీలకమైన జాతీయ కార్యక్రమం. ఇది ప్రజల సామాజిక–ఆర్థిక స్థితిపై సమగ్ర చిత్రాన్ని అందిస్తుంది. ఇది ప్రణాళిక, సుపరిపాలన, వనరుల సమాన పంపిణీకి పునాది. తద్వారా అభివృద్ధి ఫలాలు సమాజంలోని ప్రతి వర్గానికి చేర్చేందుకు ఉపకరిస్తుంది. తెలంగాణ రాష్ట్రంలో ఇదే మొదటి జనాభా గణన కావడం వల్ల ఇది మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. స్వీయ గణన మే 10 వరకు జరుగుతుంది. ఈ ప్రక్రియ అత్యంత సరళంగా ఉంది. రాష్ట్ర పౌరులందరూ ఇందులో పాల్గొని, కచ్చితమైన సమాచారాన్ని అందించాలి" అని కోరారు.

## జనగణనలో పౌరులంతా పాల్గొనాలి

-మొదటిపేజీ తరువాయి

ప్రతి పౌరుడి బాధ్యతని ప్రధాని నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. జనగణన–2027 సందర్భంగా ఇచ్చే సమాచారం సురక్షితంగా, డిజిటల్ రూపంలో ఉంటుందని తెలిపారు. ఈ ప్రక్రియలో ప్రజలంతా పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. రేడియో కార్యక్రమం 'మన్ కీ బాత్'లో ప్రధాని ఆదివారం మాట్లాడారు. తమిళనాడులోని కల్పక్కం ఫాస్ట్ బ్రీడర్ రియాక్టర్ 'క్రిటికాలిటీ' సాధించడాన్ని చరిత్రాత్మక మైలురాయిగా ప్రధాని అభివర్ణించారు. అణు శాస్త్రవేత్తల ప్రతిభను ప్రశంసించారు. దేశ పౌర అణు కార్యక్రమం పురోగతి సాధిస్తోందని, ఇది దేశ నిర్మాణంలో కీలక పాత్ర వహించనుందని చెప్పారు. పవన శక్తి ఉత్పత్తిలో దేశం మరో మైలురాయి దాటిందని మోదీ పేర్కొన్నారు. ఈ రంగంలో భారత్ ఉత్పత్తి సామర్థ్యం 56 గిగావాట్లను దాటిందని చెప్పారు. పవన శక్తి ఉత్పత్తిలో భారత్ ప్రపంచంలో నాలుగో స్థానంలో ఉందని వెల్లడించారు. డైరీ రంగం పెద్ద ఎత్తున మార్పులకు లోనవుతోందని, భారత సంప్రదాయ రుచులకు ఈ రంగం కొత్త గుర్తింపును తీసుకొస్తోందని పేర్కొన్నారు.

ఈశాన్య భారతంలోని కళాకారులను ప్రోత్సహించడానికి ప్రతి ఒక్కరూ అక్కడి వెదురు వస్తువులను కొనుగోలు చేయాలని మోదీ పిలుపునిచ్చారు.

నోబెల్ పురస్కార గ్రహీత రవీంద్రనాథ్ ఠాగూర్‌ను ప్రధాని స్మరించుకున్నారు. ఠాగూర్ గొప్ప రచయిత, ఆలోచనాపరుడని, ప్రఖ్యాతి గాంచిన సంస్థలెన్నింటినో ఆయన తీర్చిదిద్దారని పేర్కొన్నారు. చిలీలోని ఓ సంస్థ బుద్ధుడి బోధనలను ప్రచారం చేయడంపై మోదీ ఆనందం వ్యక్తం చేశారు.

# దిగ్బంధనం తొలగించాల్సిందే

దుబాయ్: అమెరికా–ఇరాన్ మలి విడత చర్చలపై అనిశ్చితి కొనసాగుతోంది. శాంతి ఒప్పందం కుదిరేదాకా ఇరాన్ ఓడరేవుల దిగ్బంధనాన్ని ఉపసంహరించుకోబోమని అమెరికా చెబుతుండగా.. దాన్ని తొలగించే వరకూ చర్చలు జరపబోమని ఇరాన్ స్పష్టం చేస్తోంది. ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్‌కు పాకిస్థాన్ ప్రధాన మంత్రి షెహబాజ్ షరీఫ్ శనివారం రాత్రి ఫోన్ చేశారు. ప్రాంతీయంగా ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులపై వారిద్దరూ చర్చించారు. ఇరాన్ శాంతినే కోరుకుంటోందని పెజెష్కియాన్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు. అయితే దిగ్బంధనం సహా నిర్వహణ పరమైన అడ్డంకులన్నింటినీ అమెరికా తొలగిస్తేనే.. మళ్లీ శాంతి చర్చలు జరుగుతాయన్నారు. మరోవైపు పాక్ అగ్ర నేతలతో శనివారం సమావేశమైన అనంతరం ఒమన్‌కు వెళ్లిన ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ.. అక్కడి నుంచి ఆదివారం రాత్రి తిరిగి ఇస్లామాబాద్‌కే వచ్చారు. పాక్ సైన్యాధిపతి ఫీల్డ్ మార్షల్ అసీం మునీర్‌తో భేటీ అయ్యారు. పలు కీలక అంశాలపై వారు మంతనాలు జరిపినట్లు తెలుస్తోంది. దీంతో అమెరికా–ఇరాన్ మలి విడత చర్చలపై మళ్లీ ఆశలు చిగురిస్తున్నాయి. తమ మధ్యవర్తిత్వంలో వాటి మధ్య పరోక్ష చర్చలు ఇప్పటికీ కొనసాగుతున్నాయని పాక్‌కు చెందిన ఇద్దరు సీనియర్ అధికారులు తెలిపారు.ఇస్లామాబాద్ నుంచి అరాగ్చీ ఆదివారం రాత్రే మాస్కోకు బయలుదేరి వెళ్లారు. హర్మూజ్ జలసంధిలో భద్రతతో పాటు యుద్ధం ముగింపు దిశగా జరుగుతున్న ప్రయత్నాల గురించి ఒమన్ పర్యటనలో సుల్తాన్ హైథమ్ బిన్ తారిఖ్ అల్–సయీద్‌తో అరాగ్చీ చర్చించారు.

# ఘనంగా కన్యకా పరమేశ్వరి అమ్మవారి జన్మదినం మహోత్సవం





**అనకాపల్లి, పెన్ సత్తా, ఏప్రిల్ 26:** పట్టణంలో 1925 లో స్థాపించిన 100 సంవత్సరాల చరిత్ర కలిగిన కన్యకా పరమేశ్వరి దేవస్థానం సంఘం ఆధ్వర్యంలో వైశాఖ మాస శుద్ధ దశమి ఆదివారం ఆలయంలో కన్యకా పరమేశ్వరి అమ్మవారి జన్మదినం మహోత్సవం ఘనంగా నిర్వహించారు. తెల్లవారు జామున అమ్మవారి ఉత్సవ విగ్రహాని ప్రత్యేక అలంకరణ చేసి, వెండి రథం పై పట్టణ మంతా ఊరేగింపు నిర్వహించారు. అమ్మవారి నామ భజన సంకీర్తనలతో, మేళ తాళాములతో వైభవంగా తిరువీధి మహోత్సవం జరిగింది. నిత్య ప్రార్థనలు, గోపూజ, నగరేశ్వర స్వామి, జనార్ధన్ స్వామి కి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఆలయ ముఖ మండపంలో అమ్మవారి ఉత్సవమూర్తికి భక్తులచే బియ్యాభిషేకం, అమ్మవారి మూల విరాట్ కు లక్ష మల్లెపూలతో అర్చన చేశారు. సామూహిక మహిళలచే లలిత సహస్ర నామ స్తోత్ర పారాయణం, భారీ అన్న సమారాధన, ఆలయం చుట్టూ వెండి రథం పై అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని తో 102 రకాల స్వీట్లు తో ప్రదర్శన జరిగింది. అమ్మవారికి ఊంజల్ సేవ, కోలాటములు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో



ఆలయ అధ్యక్షులు వుప్పల రవిరామ్ జవహర్, కార్యదర్శి శ్రీధరాల సోమరాజు, కోశాధికారి కడిమిశెట్టి అచ్యుత రామయ్య, ఉత్సవ కమిటీ చైర్మన్ గ్రంధి వివిఎస్ మాణిక్యం, భక్తులు తదిరులు పాల్గొన్నారు.

# ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు






**అనకాపల్లి, పెన్ సత్తా, ఏప్రిల్ 26:** ఉత్తరాంధ్ర ఇలవేల్పు, గవరపాలెం లోవెలిసిన నూకాంబిక అమ్మవారి దేవస్థానంలో ఆదివారం అమ్మవారికి ప్రత్యేక అలంకరణ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా చుట్టు పక్కల నుండి పట్టణ గ్రామీణ ప్రాంతాలు నుండి అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించు కొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ఆవరణలో వంటలు వండుకొని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ సిబ్బంది చర్యలు తీసుకున్నారు.

ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ పీలా నాగశ్రీను (గొల్ల బాబు), ఆలయ సహా కమిషనర్ యాళ్ళశ్రీధర్ ఆలయ ధర్మకర్తలు సూరే సతీష్, దాడి రవికుమార్, పొలిమేర స్వాతి ఆనంద్, మారిశెట్టి శంకర్రావు, కాండ్రేగుల రాజారావు, మజ్జి జానకి శ్రీనివాస రావు,

కొడుకుల శ్రీకాంత్, వద్దాది మంగ, కోనేటి సూర్యలక్ష్మి పైడిరాజు, యర్రవరపు సంతోషి కుమారినాగేష్, కూటమి నాయకులు, భక్తులు తదిరులు పాల్గొన్నారు.

# ఎనిమిదవ రోజుకు చేరుకున్న భద్రకాళి భద్రేశ్వరుల కల్యాణ బ్రహ్మోత్సవాలు



**పెన్ సత్తా, ఏప్రిల్ 26:** వరంగల్ మహానగరంలో చరిత్ర ప్రసిద్ధిగాంచిన శ్రీ భద్రకాళీ దేవస్థానంలో శ్రీ భద్రకాళీ భద్రేశ్వరుల శ్రీ కళ్యాలు బ్రహ్మోత్సవాలు ఈ రోజుతో ఎనిమిదవ రోజుకు చేరుకున్నాయి. అమ్మవారికి ఉదయం గం॥ 04-00లకు నిత్యాహ్నికం నిర్వహించి చతుస్థానార్చన తర్వాత అమ్మవారికి హరిద్రోత్సవం, బలి ఉత్సవం నిర్వహించారు. ఈ రోజు ఉభయదాతలైన తెలంగాణా గౌడ సంఘం వారి ఆహ్వానం మేరకు అనేక మంది గౌడ కులస్తులు ఆలయానికి విచ్చేసి అమ్మవారి సేవలో పాల్గొన్నారు. ముందుగా అమ్మవారికి పట్టుబట్టలు, పూలు, పండ్లు అన్నీ శిరస్సు మీద ధరించి మేళతాళాలతో వేదమంత్రాలతో గుడిలోనికి ప్రవేశించి అమ్మవారికి సమర్పించారు. అమ్మవారికి శోడషోపచారపూజ జరిపి అమ్మవారి అనుజ్ఞ గైకొని స్నపనమండపంలోకి వచ్చి అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. అనంతరం వందల మంది నారీమణులచే అమ్మవారికి కుంకుమార్చన జరుపబడింది. ఆ తర్వాత గ్రహమఖం, దుర్గాహటరీమం, లక్ష్మీ హోమాదులు జరుపబడ్డాయి. అటుపిమ్మట అమ్మవారికి హరిద్రోత్సవం, అమ్మవారికి బలి ఉత్సవం జరిగినది. ఈ రోజున గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీ బొనగాని యాదగిరి గౌడ్ ఆధ్వర్యమున ఈ రోజు కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి.

ఆలయానికి విచ్చేసిన భక్తులకు అన్నదానం నిర్వహించబడింది. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిధిగా బి.సి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు శ్రీ జాజుల శ్రీనివాస్ గౌడ్, బి.సి సంక్షేమ సంఘం అధ్యక్షులు శ్రీ బైరి రవికృష్ణ గౌడ్, యువజన సంఘం అధ్యక్షులు శ్రీ ఎరుకొండ పవన్ గౌడ్, కార్పోరేటర్ శ్రీమతి పోశాల పద్మస్వామి గౌడ్, మాజీ కార్పోరేటర్ నాగపురి సంజయ్ కల్పణ, రాష్ట్ర కార్యదర్శి కుమారస్వామి గౌడ్, చింత రమేష్ గౌడ్, దూలం రాజు నీరజ, బుర్ర శ్యాంగౌడ్, దూలం శ్రీనివాస్ మరియు వివిధ జిల్లాల నుండి అనేక మంది గౌడ ప్రముఖులు పాల్గొన్నారు.

సాయంకాలం అమ్మవారికి అర్చనాదులు, సాయం జౌపానన, దీక్షా హటరీమం, బలిహరణ జరుపబడిన అనంతరం అమ్మవారిని భద్రకాళి మహాత్రిపుర సుందరిగా అలంకరించి రథసేవ జరిపారు. ఈ రథసేవ ఉమ్మడి వరంగల్ జిల్లా రెడ్డి సంక్షేమ సంఘం అధ్వర్యంలో నిర్వహించబడింది. వందలాదిగా భక్తులు పాల్గొని అమ్మవారి రథాన్ని లాగుతూ భక్తి పారవశ్యంతో పులకించిపోయారు. ఆహ్లాదకరమైన ప్రకృతి సిద్ధమైన వాతావరణంలో అమ్మవారి గుడిలో ఈ రథసేవ జరుగుతున్నంత సేపు భద్రకాళి శరణం మమ అనే నామ స్మరణతో దేవాలయ ప్రాంగణమంతా మారుమోగింది.

ఈ రోజు అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులలో తెలంగాణా రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీమతి ఎర్రబెల్లి స్వర్ణ-రాజేశ్వర్రావు దంపతులు తదితరులున్నారు.

## శ్రీ భద్రకాళి భద్రేశ్వర కళ్యాణ బ్రహ్మోత్సవాలు



**వరంగల్ పెన్ సత్తా, ఏప్రిల్ 26:** గిర్మాజీపేట వాస్తవ్యులు చిట్టిమల్ల ప్రణతి వారి నృత్య బృందం చే నృత్య ప్రదర్శన

వరంగల్ పట్టణం గిర్మాజీపేట ప్రాంతంలో నివసిస్తూ కూచిపూడి నాట్య గురువుగా అంచలంచలుగా పేరు పొందుతున్న కూచిపూడి నాట్య గురువు శ్రీ కుమారి చిట్టిమల్ల ప్రణతి భద్రకాళి భద్ర బ్రహ్మోత్సవాల సందర్భంగా కూచిపూడి నాట్య ప్రదర్శన ప్రదర్శించడం జరిగింది

నాట్య ప్రదర్శన చిన్నారులు శరణ్య అద్వైత్. శ్రీ చక్రాంతిక. జ్యోతిక నిఖిత హాసిని పాల్గొన్నారు. శివపార్వతుల కళ్యాణ నృత్య ప్రదర్శన అందర్నీ ఆకట్టుకుంది కళాకారులను అభినందిస్తూ ఆలయ అధికారులు ఆ చిన్నారులకు సర్టిఫికెట్ ఇచ్చి చిన్నారులను ఆనందింప చేశారు

# పెద్దమ్మ గుడి నిర్మాణమునకు విరాళామందించిన దాతలు



**శ్రీరంగాపూర్ పెన్ సత్తా, ఏప్రిల్ 26::** శ్రీరంగాపూర్ మండల్ వెంకటాపూర్ గ్రామంలో ఆదివారం రోజున పెద్దమ్మ గుడి నిర్మాణం కొరకు వెంకటాపూర్ గ్రామ కులస్తులు దైవ భక్తితో విరాళం అందించడం జరిగింది. గ్రామంలో అన్ని కులస్తులు తన వంతు ఆర్థిక సాయం అందించారు . కాబట్టి పెద్దమ్మ గుడి నిర్మాణం కు

1) రామసముద్రం మత్స్య సహకార సంఘం సభ్యులు 50000 వేలు రూపాయలు

2) క్రీస్తు శేషులు మెంటేపల్లి బాలయ్య జ్ఞాపకార్థం వారి కుమారులు మెంటేపల్లి బాల కిష్టయ్య మెంటపల్లి శ్రీనివాసులు ఐదువేల రూపాయలు

గ్రామ పెద్దలకు దేవాలయ మేనేజ్మెంట్ సభ్యులకు అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రామసముద్రం సంగం సభ్యులు మరియు సంఘం పెద్దలు మరియు గ్రామ పెద్దలు గ్రామ సర్పంచ్ సూరగౌని భారతీ ఎల్లా గౌడ్ మాజీ సర్పంచ్ కృష్ణయ్య మాజీ సర్పంచ్ వరలక్ష్మి శ్రీనివాసులు మాజీ విద్యా కమిటీ చైర్మన్ వెంకట్ స్వామి గ్రామ కమిటీ అధ్యక్షులు వెంకటయ్య రామసముద్రం అధ్యక్షులు తెలుగు మన్యం భగవంతు మొగులయ్య లక్ష్మయ్య సురేష్ అనిష్ రాఘవేందర్ సంఘ సభ్యులు శ్రీనివాసులు తెలుగు వెంకటేష్ న్యాయవాది బాలకృష్ణయ్య సింగల్ డో డైరెక్టర్ శ్రీనివాస్ గౌడ్ దశరథం జానకి రాముడు మెంటపల్లి శంకర్ నాయుడు కంసలి ధర్మడు ఆంజనేయులు డీజే వెంకటేష్ దేవేందర్ హరిజన్ కృష్ణయ్య రాముడు తెలుగు మహేష్ గ్రామ పెద్దలు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## రంగాపురం గ్రామంలో ఘనంగా ఇందిరమ్మ గృహప్రవేశాలు...

**హాజరైన కాంగ్రెస్ నాయకులు**



**పెబ్బేర్: పెన్ సత్తా, ఏప్రిల్ 26:** పేదల ఆత్మగౌరవానికి ప్రతీకలైన ఇందిరమ్మ ఇళ్లు వారి జీవితాల్లో కొత్త వెలుగులు నింపుతాయని పెబ్బేరు మండలం రంగాపురం గ్రామ కాంగ్రెస్ నాయకులు అన్నారు. రంగాపురం గ్రామంలో మాల జానకమ్మ, తెలుగు కటికల శివమ్మ భర్త ఎల్లస్వామి గార్లు నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ వేడుకలకు వారు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రజాపాలన రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకం ద్వారా సొంత స్థలం ఉండి ఇల్లు లేని నిరుపేదలకు భరోసా లభిస్తుందని పేర్కొన్నారు. పేద ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని వారు తెలిపారు. లబ్ధిదారుల ఆనందం...ఏళ్ల తరబడి అద్దె ఇళ్లలో మగ్గుతున్న తమకు, నేడు సొంత ఇంటి యజమానులను చేసిన ప్రభుత్వానికి, సహకరించిన రంగాపురం కాంగ్రెస్ ముఖ్య నాయకులు బి.రాంచంద్రారెడ్డి గారికి కాంగ్రెస్ నాయకులకు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు లబ్ధిదారుల కుటుంబ సభ్యులతో కలిసి వారి ఆతిథ్యాన్ని స్వీకరించి, వారితో ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు కావలి బాలస్వామి(చిన్నోడు), కాంగ్రెస్ పార్టీ గ్రామ కార్యదర్శి దాది రాముడు, నాజా జిల్లా అధ్యక్షులు మందడి చిరంజీవి, ఉప సర్పంచ్ పెద్దింటి నందీశ్వర్, మాజీ సింగిల్ విండో డైరెక్టర్ పెద్దింటి చంద్రయ్య, వార్డు సభ్యులు కటికల ఎల్లస్వామి, దాది రాముడు, నాయకులు దారపోగు వెంకటేష్, గొల్ల వెంకటయ్య, దాది శేఖర్, పిట్ట నాగేంద్రం, బెరికి లక్ష్మయ్య, పెద్దింటి సంజీవ్ కుమార్, బాపన్ పల్లి నరేష్, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ భద్రకాళి బద్వేశ్వరుల కళ్యాణ బ్రహ్మోత్సవాలు



**వరంగల్ పెన్ సత్తా, ఏప్రిల్ 26:**బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈరోజు సాయంకాలం రథోత్సవం రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అత్యంత వైభవోపేతంగా నిర్వహింపబడింది. ఈ కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ నాయిని రాజేందర్రెడ్డి– నీలిమ దంపతులు రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షులు మాదిరెడ్డి రవీందర్ రెడ్డి, కార్యదర్శి చాడ సునీల్ రెడ్డి ఉపాధ్యక్షులు చందుపట్ల సత్యనారాయణ రెడ్డి కోశాధికారి హనుమారెడ్డి సహకారదర్శి పద్మనాభరెడ్డి రజనీకాంత్ రెడ్డి అడ్వైజర్ సీతారామరెడ్డి, దేవాలయ ధర్మకర్త శ్రీ గాదె శ్రవణ్ కుమార్ రెడ్డి, నల్ల రాజిరెడ్డి అధ్యక్షులు మరియు పూర్వాధ్యక్షులు జనార్దన్ రెడ్డి మరియు అనేకమంది రెడ్డి కులస్తులు కుటుంబ సభ్యులతో పాల్గొన్నారు. వాహన సేవానంతరం దేవాలయ కార్య నిర్వహణ అధికారి శ్రీమతి రామల సునీత ఎమ్మెల్యే దంపతులకు అమ్మవారి శేష వస్త్రాలు బహుకరించారు, ప్రధాన అర్చకులు శ్రీ భద్రకాళి శేషు, వేద పండితులు మహదాశీర్వచనం నిర్వహించారు. అనంతరం అన్న ప్రసాద వితరణ నిర్వహించారు.

## జయపురంలో వాలీబాల్, టేబుల్ టెన్నిస్ శిక్షణ శిబిరం ప్రారంభం



**నర్సింహులపేట, పెన్ సత్తా, ఏప్రిల్ 26:** మండలం జయపురం గ్రామంలో ప్రతి సంవత్సరం వేసవి వాలీబాల్ శిక్షణ శిబిరం నెలరోజుల పాటు శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వంగల ప్రవీణ్ కుమార్,గ్రామస్థుల ఆర్థిక సహకారంతో మారుమూల గ్రామం లోని విద్యార్థినీలను వాలీబాల్, వివిధ క్రీడలో జాతీయ స్థాయి క్రీడాకారులు గా తీర్చిదిద్దాతున్న

రిటైర్డ్ వ్యాయామ ఉపాధ్యాయుడు కోచ్ నెలకుర్తి వీరారెడ్డి ఆధ్వర్యంలో జయపురం గ్రామానికి చెందిన కీర్తిశేషులు వంగాల సుదర్శన్ రెడ్డి,వంగాల రాంచంద్రారెడ్డి వారి జ్ఞాపకార్థం వాలీబాల్, టేబుల్ టెన్నిస్ సమ్మర్ క్యాంపును నెలరోజుల పాటు నిర్వహించనున్నారు. ఈ వేసవి వాలీబాల్ శిక్షణ శిబిరం సమావేశాం సందర్భంగా ముఖ్యఅతిథిగా నర్సింహులపేట ఎస్సై సురేష్ పాల్గొని క్రీడాకారుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిన్నారులు వేసవి సెలవులను ప్రణాళిక ప్రకారం తమకు నచ్చిన ఆటల్లో నేర్పరులుగా తయారయేందుకు సమ్మర్ కోచింగ్ క్యాంపులను వినియోగించుకోవాలన్నారు. వేసవి సెలవుల్లో నచ్చిన ఆటలో ఆరితేరేలా సమ్మర్ కోచింగ్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల్లో దాగి ఉన్న నైపుణ్యతలను వెలికితీసేందుకు కృషి చేయాలన్నారు. క్రీడల పట్ల ఆసక్తి కలిగిన వారిని ఆ దిశలో ప్రోత్సహిస్తే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను చేరుకుంటారన్నారు. క్రీడలతో మానసిక, శారీరక ఉల్లాసం చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వెంకటయ్య, రఘోత్తమ్ రెడ్డి, శ్రీరామ్ సిటీ ఫైనాన్స్ జీఎం శ్రీనివాస్ రెడ్డి రివిజనల్ మేనేజర్ ఇమామ్ పాషా, అశోక్ రెడ్డి, ఉప సర్పంచ్ వేణు, ఇమ్మడి కృష్ణమూర్తి,రావుల శ్రీనివాస్, మందుల రామ్మూర్తి, గ్రామస్థులు పాల్గొన్నారు.

## ఘనంగా బ్రహ్మంగారి ఆరాధన మహోత్సవం



**నర్సింహులపేట, పెన్ సత్తా, ఏప్రిల్ 26:**నర్సింహులపేట మండల కేంద్రంలో విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం వీరబ్రహ్మేంద్రస్వామి వారి ఆరాధన మహోత్సవంను ఘనంగా నిర్వహించడం జరిగింది.

వైశాఖ శుద్ధ దశమి పర్వదిన సందర్భంగా జగద్గురు శ్రీశ్రీశ్రీ మద్విరాట్ పోతులూరు శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాములవారి సజీవ సమాధి అయి 333 వ సంవత్సరంలు అవుతున్నది. ఈ సందర్భంగా ఆదివారం స్వామివారికి గణపతి పూజ , స్వస్తి పుణ్యాహవాసన , స్వామి వారి మండపారాధన , హితయధి పూజ కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది.

ఈ కార్యక్రమంలో పురోహితుడు రాగి యాకేంద్రాచార్యులు , మండలంలోని విశ్వబ్రాహ్మణ పెద్దలు దక్షిణామూర్తి , నాగేశ్వరచారి మరియు విశ్వబ్రాహ్మణ కులస్థులు సోమనర్సయ్య చారి , రామచంద్రయ్య చారి , వీరబ్రహ్మాచారి , రాజు , ప్రసాద్ , విశ్వనాథం , శేషు కుమార్ , భక్తులు , తదితరులు పాల్గొన్నారు.

# మొండిగౌరెల్లిలో భూసేకరణ దందా..? కోట్ల రూపాయల చేతులు మార్పిడి ఆరోపణలు..

**తెలంగాణ రాష్ట్ర భూముల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గోడుకొండ్ల ప్రవీణ్..**

**రంగారెడ్డి జిల్లా, యాచారం, పెన్ సత్తా, ఏప్రిల్ 26::**రంగారెడ్డి జిల్లా యాచారం మండలం మొండిగౌరెల్లి గ్రామంలో భూసేకరణ పేరుతో కోట్ల రూపాయలు చేతులు మారుతున్నాయన్న ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. పారిశ్రామిక పార్క్ ఏర్పాటుకు సంబంధించి సర్వే నంబర్లు 19, 68, 127లో మొత్తం 677.29 ఎకరాల భూమిని సేకరించేందుకు ప్రభుత్వం గత ఏడాది నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కొంతమంది భూకబ్జాదారులు, రాజకీయ నాయకులు రెవిన్యూ అధికారులతో చేతులు కలిపి అక్రమాలకు పాల్పడుతున్నారని తెలంగాణ రాష్ట్ర భూముల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గోడుకొండ్ల ప్రవీణ్ తీవ్ర ఆరోపణలు చేశారు. సర్వే నెంబర్ 19 పరిధిలో అధికారులు ఫోటోలు తీస్తున్నారన్న సమాచారం నేపథ్యంలో అనుమానాలు మరింత బలపడుతున్నాయని ఆయన పేర్కొన్నారు. గ్రామంలోని సోమన్న గుడి సమీపంలోని గుండం మినహా మిగతా గుట్టలు, బండలను కూడా కబ్జా భూములుగా చూపిస్తూ అక్రమంగా లావాదేవీలు జరుగుతున్నాయన్నారు. సాగుకు అనుకూలంగా లేని భూములకు కూడా కబ్జా రేట్లు కట్టించడం ద్వారా కోట్ల రూపాయల దందా సాగుతోందని ఆరోపించారు. ఇప్పటికే గుట్టలపై రైతుబంధు తీసుకుని లాభాలు పొందిన కొందరు నాయకులు, ఇప్పుడు భూసేకరణ పేరుతో మరింతగా దోపిడీకి పాల్పడుతున్నారని విమర్శించారు. మరోవైపు, భూముల సర్వే పూర్తయిన తరువాత రైతులకు వారి అసలు భూమి ఎంత, కబ్జా ఎంత అనే వివరాలు వెల్లడించకపోవడం వెనుక పెద్ద రహస్యం ఉందని ప్రశ్నించారు. రైతులకు నష్టం కలిగే విధంగా ఒకవైపు వ్యవహరిస్తూనే, మరోవైపు నాయకులు – అధికారుల మధ్య భారీగా ముడుపులు మారుతున్నాయని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ ఆస్తులను కాపాడాల్సిన అధికారులే నిర్లక్ష్యంగా వ్యవహరించడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. గ్రామంలో రాజకీయ నాయకుల అత్యుత్సాహం, అధికారుల మౌనం నేపథ్యంలో ఈ భూసేకరణ వ్యవహారం మరింత వివాదాస్పదంగా మారింది. ఈ అంశంపై జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా దృష్టి సారించి, సాగుకు అనుకూలంగా ఉన్న కబ్జా భూములకు మాత్రమే నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో యాచారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరాహార దీక్షకు దిగుతామని హెచ్చరించారు.



# రైతు సంక్షేమమే ప్రభుత్వ ద్వేయం: ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి..



**రంగారెడ్డి జిల్లా, ఇబ్రహీంపట్నం పెన్ సత్తా, ఏప్రిల్ 26:** రైతు సంక్షేమమే ప్రభుత్వ ద్వేయం అని ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నం పట్టణ కేంద్రంలోని మార్కెట్ యాడ్, దండుమైలారం, మంచాల మండలంలో నోముల గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సంక్షేమమే ప్రభుత్వ ద్వేయం అని పేర్కొన్నారు. రైతు అభివృద్ధి రాష్ట్ర అభివృద్ధి అన్న సంకల్పంతో ప్రారంభమైన ఈ కొనుగోలు కేంద్రం రైతులకు పెద్ద ఊరటం ఇవ్వనుంది. నియోజకవర్గంలో రైతులు దళారుల మోసాలకు గురికాకుండా, ప్రభుత్వ మద్దతుతో నేరుగా ధాన్యం విక్రయించే అవకాశం కల్పిస్తూ రైతన్నకు అండగా ప్రభుత్వం ఉందన్నారు. రైతు లేనిదే రాజ్యం లేదని రైతు శ్రమకు తగిన గౌరవం దగ్గర కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రతి గింజ కు సరైన ధర అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు కొనుగోలు కేంద్రాలలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా పారదర్శకంగా కొనుగోలు జరగాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ ఛైర్మన్ కంబాలపల్లి గుర్నాథ్ రెడ్డి, కౌన్సిలర్ ఆకుల యాదగిరి, అధికారులు, రైతులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# జాగో తెలంగాణ యాత్రకు శ్రీకారం..

**రంగారెడ్డి జిల్లా, ఎల్బీనగర్, పెన్ సత్తా, ఏప్రిల్ 26::**హైదరాబాద్, వనస్థలిపురం తెలంగాణ జాగీర్ పార్టీ ఆధ్వర్యంలో "జాగో తెలంగాణ" యాత్ర ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. వనస్థలిపురం ఎన్జీవో కాలనీ నుంచి పార్టీ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు జిజేఆర్ (జయరాజ్) ఈ యాత్రకు శ్రీకారం చుట్టారు. రాష్ట్రంలోని 33 జిల్లాల పర్యటనగా కొనసాగనున్న ఈ యాత్రకు పార్టీ శ్రేణులు, అభిమానులు భారీగా తరలివచ్చారు. తమ నాయకుడు జయరాజ్‌కు మద్దతుగా ప్రజలు భారీ సంఖ్యలో హాజరై దారి పొడవునా స్వాగతం పలుకుతూ బ్రహ్మరథం పట్టారు. ఈ సందర్భంగా జయరాజ్ మాట్లాడుతూ, తరతరాలుగా కొద్ది వర్గాలే రాష్ట్రాన్ని పరిపాలిస్తున్నాయని విమర్శించారు. కార్మికులు, కర్షకుల గోసల నుంచి పుట్టిన పార్టీనే తెలంగాణ జాగీర్ పార్టీ అని తెలిపారు. తెలంగాణ వాదానికి అంకితమైన ఏకైక ప్రాంతీయ పార్టీ తమదేనని పేర్కొన్నారు. గత ప్రభుత్వాలు నీళ్లు, నిధులు, ఉద్యోగ నియామకాల విషయంలో విఫలమయ్యాయని విమర్శించారు. ఉద్యమకారులను రోడ్డుపాలు చేసిన ఘనత బీఆర్ఎస్ పార్టీకే దక్కిందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజల బతుకులు మారాలంటే జాగీర్ పార్టీ అధికారంలోకి రావాలని పిలుపునిచ్చారు. అట్టడుగు సామాన్యులను చట్ట సభల్లోకి పంపడమే తమ పార్టీ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. అందరికీ సమాన అవకాశాలు కల్పించడం తెలంగాణ జాగీర్ పార్టీ లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రజల సమస్యలను తెలుసుకోవడానికే గడప గడపకు వెళ్లే యాత్రను చేపట్టినట్లు తెలిపారు. ఉద్యమకారుల త్యాగాలతో ఏర్పడిన తెలంగాణలో ఒకే కుటుంబం లాభపడుతోందని ఆరోపించారు. రాజకీయాల్లో వ్యక్తిగత ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇస్తున్నారని ఎద్దేవా చేశారు. కేంద్రంలోని బీజేపీ నాయకులు అవకాశవాద, మతతత్వ రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. రానున్న రోజుల్లో ప్రజల ఆశీర్వాదంతో తమ పార్టీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణలో ప్రతి ఇల్లు, ప్రతి ఊరు అభివృద్ధి కేంద్రాలుగా మారేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఉపాధ్యక్షులు వి. రవికుమార్, వినోద్ ఖన్నా, రాష్ట్ర సేవాలాల్ సేన అధ్యక్షుడు రాంబాబు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.







# ఒంటరి తల్లి పార్థివ దేహానికి అంతిమ సంస్కారాలు..



**పెద్ద కొడుకులా అన్నీ తానే చేసిన సురక్ష సేవా సంఘం..**

**పాడె నుంచి చితి వరకు పూర్తి బాధ్యతతో దహన సంస్కారాలు..**

**రంగారెడ్డి జిల్లా, అబ్దుల్లాపూర్మెట్, పెన్ సత్తా, ఏప్రిల్ 26:**సమాజంలో కొందరు సొంత తల్లిదండ్రులను కూడా చూసుకోలేక శ్మశాన వాటికల్లో వదిలి వెళ్తున్న ఘటనలు పెరుగుతున్న వేళ... తెలియని ఓ మాతృమూర్తికి చివరి వరకు అండగా నిలిచి సురక్ష సేవా సంఘం మానవత్వాన్ని చాటింది. వివరాల్లోకి వెళ్తే... నందనవనం సమీపంలోని ఓ మురికివాడలో ఒంటరిగా జీవిస్తున్న సుమారు 80 ఏళ్ల కృష్ణవేణమ్మ అనారోగ్యంతో బాధపడుతూ, ఎండల తీవ్రత కారణంగా పరిస్థితి విషమించి నిన్న రాత్రి మరణించింది. ఈ విషయం పీపుల్స్ సర్వీస్ అసోసియేషన్ సభ్యులు సారిక, హేమలత, స్వరూప ద్వారా తెలుసుకున్న సురక్ష సేవా సంఘం సభ్యులు వెంటనే స్పందించారు. గ్రూప్ సభ్యుల నుంచి విరాళాలు సేకరించి... మృతదేహాన్ని పాడె నుంచి చితి వరకు అన్ని కార్యక్రమాలను సొంత తల్లిగా భావించి నిర్వహించారు. ఎఎ నగర్ శ్మశాన వాటికలో పూర్తిస్థాయిలో దహన సంస్కారాలు జరిపించారు. మానవత్వం ఇంకా బతికే ఉందని చాటి చెప్పిన ఈ సేవా కార్యక్రమంపై సర్వత్రా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. ఈ కార్యక్రమంలో సురక్ష సేవా సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కిక్కర గోపీ శంకర్ యాదవ్, పీపుల్స్ సర్వీస్ ప్రతినిధులు, సారిక, స్వరూప, హేమలతతో పాటు సురక్ష సభ్యులు నరేష్ యాదవ్, జాన్ విక్టర్, పద్మ, విల్సన్ పాల్గొన్నారు.

## ఆత్మశుద్ధి, పవిత్ర సంకల్పం కోసమే హజ్ యాత్ర: మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి

హజ్ యాత్రికులకు ఘన సన్మానం



**వనపర్తి జిల్లా: పెన్ సత్తా, ఏప్రిల్ 26:**మైనారిటీ అధ్యక్షులు జోహెబ్ హుస్సేన్ ఆధ్వర్యంలో నిర్వహించిన హజ్ యాత్రికుల అభినందన సభలో మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి పాల్గొని యాత్రికులను ఘనంగా సన్మానించారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముస్లిం సోదరులు ఆత్మశుద్ధి మరియు పవిత్ర జీవిత సంకల్పం కోసం హజ్ యాత్ర చేస్తారని తెలిపారు. ఈ యాత్ర వ్యక్తికి ఆత్మస్థైర్యాన్ని పెంపొందించి, లోక కల్యాణం కోసం పనిచేయాలనే భావనను కలిగిస్తుందని పేర్కొన్నారు. హజ్ యాత్ర విజయవంతం కావాలని ఆకాంక్షించారు.
అలాగే రాబోయే రోజుల్లో తెలంగాణలో సుపరిపాలన నెలకొనాలని అల్లాను ప్రార్థించాలని సూచించారు.
హజ్ యాత్రికులకు సన్మానం, విందు ఏర్పాటు చేసిన జోహెబ్ హుస్సేన్‌ను నిరంజన్ రెడ్డి అభినందించారు.
ఈ కార్యక్రమంలో గట్టు యాదవ్, వాకిటి శ్రీధర్, పలుస రమేష్ గౌడ్, నందిమల్ల అశోక్, కౌన్సిలర్ శ్రీకర్ గౌడ్, బండారు కృష్ణ, సమద్, స్టార్ రహీమ్, యూసుఫ్, డ్యానియల్, హారీఫ్, ఏ.కె. పాషా, ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.

## వాసవి కన్యక పరమేశ్వరి మాత జయంతి ఘనంగా నిర్వహణ




**వనపర్తి, పెన్ సత్తా, ఏప్రిల్ 26:** వాసవి కన్యక పరమేశ్వరి మాత జయంతిని పురస్కరించుకుని వనపర్తి జిల్లా పోలీసు కార్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డిసీఆర్బీ డిఎస్పీ శ్రీ బాలాజీ నాయక్ మాత చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు.
డిఎస్పీ మాట్లాడుతూ, వాసవి మాత అహింస, ధర్మం, త్యాగానికి ప్రతీకగా నిలిచారని తెలిపారు. ఆమె చూపిన సత్యం, న్యాయం, శాంతి మార్గంలో నడవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. సమాజంలో సౌహార్దం, నైతిక విలువలు పెంపొందించుకోవడం ద్వారా శక్తివంతమైన దేశ నిర్మాణం సాధ్యమవుతుందని పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ సిఐ నరేష్, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు అప్పలనాయుడు, శ్రీనివాస్, ఎస్సైలు రామరాజు, మంజునాథ్ రెడ్డి, ఆనంద్, విజయ్ కుమార్, తిరుపతిరెడ్డి, నరేందర్, అంజద్, శేఖర్ రెడ్డి, ఆర్ఎస్ఐలు వినోద్, మగ్దుం బారి తదితరులు పాల్గొన్నారు.

## స్కాలర్స్ జూనియర్ కళాశాల విద్యార్థులను అభినందించిన ఎమ్మెల్యే




**వనపర్తి జిల్లా: పెన్ సత్తా, ఏప్రిల్ 26:**వనపర్తి పట్టణంలోని స్కాలర్స్ జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్మీడియట్ పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించగా, ఎమ్మెల్యే తుడి మేఘారెడ్డి వారికి శాలువాలు కప్పి సత్కరించి అభినందించారు.
ద్వితీయ సంవత్సరం బైపీసీలో బి. మహాలక్ష్మి, ఆలీషా జి, సుస్మిత, భార్గవి; ఎంపీసీలో కే. నర్మదా, కే. శిరీష, కే. లలిత; ప్రథమ సంవత్సరం బైపీసీలో డి. పల్లవి, అప్సిన్, బి. అక్షయ లక్ష్మి; ఎంపీసీలో ఏ. బన్నీ రాష్ట్రస్థాయి మార్కులు సాధించారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే విద్యార్థులతో పాటు, వారిని ప్రోత్సహించిన అధ్యాపకులు మరియు తల్లిదండ్రులను అభినందించారు.
ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ బి. శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ మధు గౌడ్, కౌన్సిలర్లు, యూత్ కాంగ్రెస్ నాయకులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వనపర్తిలో వాసవి మాత జయంతి ఉత్సవాలు ప్రభుత్వ లాంఛనాలతో ఘనంగా.

**వనపర్తి జిల్లా పెన్ సత్తా, ఏప్రిల్ 26:**
తెలంగాణ ప్రభుత్వం ఈ ఏడాది నుంచి రాష్ట్ర పండుగగా ప్రకటించిన శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి జయంతి ఉత్సవాలు వనపర్తి జిల్లా కేంద్రంలో వైభవంగా జరిగాయి.
వైశాఖ శుక్ల దశమి పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ప్రభుత్వ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. స్థానిక శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి వాసవి మాత చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.
అనంతరం పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ప్రత్యేక అభిషేకాలు, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆర్యవైశ్య సోదరులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.
ఈ వేడుకల్లో మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ ఉపాధ్యక్షుడు మధుసూదన్ గౌడ్, జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి సుధీర్ రెడ్డితో పాటు ఆర్యవైశ్య సంఘం పెద్దలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎల్కుర్తి, రామన్నగూడెం గ్రామాలలో నూతన ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ ప్రారంభోత్సవం ఎమ్మెల్యే కడియం శ్రీహరి





**హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం పెన్ సత్తా, ఏప్రిల్ 26:**ధర్మసాగర్ మండలం ఎల్కుర్తి గ్రామంలో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎల్కుర్తి గ్రామంలో 15లక్షల రూపాయలతో నిర్మించిన సిసి రోడ్డు, అంగన్వాడీ సెంటర్ ప్రహరీ గోడ, ఇందిరమ్మ ఇల్లు, రామన్నగూడెంలో 12లక్షల 50వేలతో నిర్మించిన పాఠశాల ప్రహరీ గోడ, 5లక్షల రూపాయలతో నిర్మించిన సిసి రోడ్డు, ఇందిరమ్మ ఇల్లు, ఐకేపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు.
అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.
ముఖ్యమంత్రి రేవంత్ రేవంత్ రెడ్డి వ్యవసాయ రంగానికి పెద్ద పీట వేస్తూ రైతు సంక్షేమానికి అనేక పథకాలు అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల వద్ద నుండి మద్దతు ధరతో ప్రభుత్వం కొనుగోలు చేసి తిరిగి మార్కెట్లో అమ్మితే ప్రభుత్వానికి సీజన్ 5వేల కోట్ల నష్టం వస్తుందని తెలిపారు. ప్రభుత్వానికి నష్టం వచ్చినా రైతులు ఆర్థికంగా నష్టపోకూడదనే ఉదేశ్యంతో ప్రభుత్వమే మద్దతు ధర ఇచ్చి దాన్యాన్ని కొనుగోలు చేస్తూ రైతులకు అండగా నిలుస్తుందని అన్నారు. దీనిని రైతులు, ప్రజలు గమనించాలని కోరారు. రైతులు కొనుగోలు కేంద్రాలని సద్వినియోగం చేసుకొని మద్దతు ధరకు దాన్యాన్ని అమ్ముకోవాలని సూచించారు.
పేద ప్రజల స్వంత ఇంటి కళను కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సాకారం చేశారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండు సంవత్సరాల కాలంలో గత ప్రభుత్వ పథకాలను కొనసాగిస్తూనే 6గ్యారెంటీల అమలులో భాగంగా అనేక కొత్త పథకాలను ప్రవేశపెట్టినట్లు తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200యూనిట్ల ఉచిత విద్యుత్, సన్న బియ్యం పంపిణీ, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, సన్నాలకు బోనస్, ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు వంటి అనేక సంక్షేమ పథకాలు ప్రతీ ఇంటికి చేరుతున్నాయని వెల్లడించారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం చేసిన 8లక్షల కోట్ల అప్పుకు ప్రతీ నెల 7వేల కోట్ల మిత్తిలు చెల్లిస్తూ కూడా పేద ప్రజల సంక్షేమ పథకాలను ఆపకుండా అమలు చేస్తున్నట్లు తెలిపారు. త్వరలోనే 2లక్షల కొత్త పెన్షన్లు మంజూరు చేయడంతో పాటు తెల్ల రేషన్ కార్డు ఉన్న కోటి 10లక్షల కుటుంబాలకు ఇందిరా కుటుంబ భీమా పథకాన్ని అమలు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా కుటుంబ పెద్ద చనిపోతే 15 రోజులలో 5లక్షల రూపాయలు ఆర్థిక సహాయం అందించనున్నట్లు తెలిపారు. ఆర్థిక పరమైన ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రజల సంక్షేమానికి కృషి చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజల ఆశీర్వాదం ఉండాలని కోరారు.
ఎల్కుర్తి, రామన్నగూడెం గ్రామాలకు 30ఏళ్ల క్రితం నేను వేసిన రోడ్లే ఉన్నాయని అన్నారు. ఎల్కుర్తి గ్రామానికి నాలుగు వైపులా బిటీ రోడ్లు, రమ్మన్నగూడెంకు బిటీ రోడ్డు ఆనాడు ఉమ్మడి రాష్ట్రంలో నేను మంత్రిగా ఉన్నప్పుడు వేసానని తెలిపారు. అలాగే గ్రామంలో భూమి లేని నిరుపేదలకు భూ పట్టాల పంపిణి, పాఠశాల, వాటర్ ట్యాంక్, సిసి రోడ్లు, ఇండ్లు మంజూరు చేసుకున్నామని వెల్లడించారు. అయితే 20ఏళ్ళు ఎమ్మెల్యే గా ఉన్నవాళ్లు కాస్తంత కూడా అభివృద్ధి గురించి ఆలోచించలేదని విమర్శించారు. ఇప్పుడు మళ్ళీ నేను ఎమ్మెల్యే గా ఎన్నికైన నాటి నుండి ఒక్కొక్కటిగా పనులు చేస్తున్నాని అన్నారు. ఎల్కుర్తి గ్రామం మీదుగా జాతీయ రహదారి నుండి నారాయణగిరి వరకు 50కోట్లతో డబుల్ రోడ్డు మంజూరు అయిందని త్వరలోనే పనులు ప్రారంభం.గ్రామ పరిధిలో సిసి రోడ్డు నిర్మాణం చేయిస్తానని హామీ ఇచ్చారు. మొదటి విడతలో ఎల్కుర్తి, రామన్నగూడెం గ్రామాలకు 21ఇండ్లు మంజూరు చేశానని రెండో విడతలో మరో 30ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తానని తెలిపారు. అలాగే ఎస్సి కమ్యూనిటీ హాల్, అసంపూర్తిగా ఉన్న మహిళా కమ్యూనిటీ హాల్కు 10లక్షలు మంజూరు చేస్తానని, గ్రామంలో అంతర్గత సిసి రోడ్లు కూడా మంజూరు చేస్తానని పేర్కొన్నారు. రామన్నగూడెంలో 10లక్షల సిసి రోడ్లు, ఎల్కుర్తి నుండి రామన్నగూడెం వరకు బిటీ రోడ్డు మంజూరు చేస్తానని 6నెలలలోపు ఈ పనులను పూర్తి చేస్తానని వెల్లడించారు.
ప్రజలు అవకాశం ఇచ్చినప్పుడు పని చేయని వారు, అవినీతి అక్రమాలకు పాల్పడుతూ తాగుడు, తినుడు చేసిన వారు చాలా మాటలు మాట్లాడుతున్నారని ఆరోపించారు. నేను ఎం పనులు చేశానో ఎల్కుర్తి గ్రామ చౌరస్తాలో నిలబడి చెప్పే సత్తా నాకు ఉంది. మీకు ఉందా అని ప్రశ్నించారు. రాజకీయాలలోకి 32ఏళ్ళు అవుతుందని, ఈ 32 ఏళ్లుగా నిజాయితీగా పని చేస్తున్నాని ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని ప్రజల సమస్యల పరిష్కారానికే నీతి నిజాయితీగా ఉపయోగిస్తున్నానని వెల్లడించారు. ఏనాడూ ఎవరి దగ్గర పని ఇప్పిస్తాననో, పదవులు ఇప్పిస్తాననో ఒక్క రూపాయి తీసుకోలేదని 32ఏళు ్లగా రాజకీయాలలో కొనసాగుతున్నాను అంటే నా నిజాయితీనే కారణం అని స్పష్టం చేశారు. రాజకీయాలు పక్కన పెట్టి గ్రామ అభివృద్ధికి అందరు కలిసి కట్టుగా ఉండలాని సూచించారు. ఎవరెన్ని విమర్శలు చేసిన నేను పట్టించుకోనని, నాకున్న ఏకైక ఎజెండా, సంకల్పం స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గాన్ని అభివృద్ధిలో అగ్రభాగన నిలపాలి, పేద ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించడమే అని తెలిపారు. ఎల్కుర్తి గ్రామాన్ని ప్రత్యేక దృష్టితో అత్యధిక నిధులు వెచ్చించి అభివృద్ధి చేసే బాధ్యత నాదని, దానికి మీ అందరి సహకారం, మద్దతు కావాలని విజ్ఞప్తి చేశారు.
ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సుధాకర్, ఎంపిడివో, హౌసింగ్ ఇంచార్జ్ పీడీ సిధ్ధార్థ నాయక్, పిఆర్ డీఈ శ్రీనివాస్, ఏఈలు, వరంగల్ ఏనుమాముల మార్కెట్ డైరెక్టర్ బొడ్డు ప్రదీప్ కుమార్ , మాజీ ఎంపీటీసీలు, గ్రామ సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు మెంబర్లు, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు, మండల నాయకులు ,గ్రామ శాఖ నాయకులు, రైతులు, మహిళలు ఇతర , గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## మాందాపూర్‌లో శనివారం జరిగిన గంప జాతరలో గంపలతో ఊరేగింపుగా వస్తున్న మహిళా భక్తుల

**వనపర్తి జిల్లా పెన్ సత్తా, ఏప్రిల్ 26:**: పానగల్ మండలం మాందాపూర్‌లో శనివారం గంప జాతర వైభవంగా జరిగింది. గ్రామ దేవతకు మొక్కులు తీర్చుకునేందుకు మహిళలు గంపలతో ఊరేగింపుగా తరలివచ్చారు. బోనాలు, గంపలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలోసర్పంచ్ సుగుణమ్మ రాములు, మాజీ సర్పంచ్ జయరాములు సాగర్, మాజీ సర్పంచ్ కృష్ణయ్య సాగర్ ఎంపీటీసీ భాస్కర్ రెడ్డి, గ్రంథాలయ చైర్మన్ గోవర్ధన్ సాగర్ పాల్గొన్నారు



## వనపర్తిలో స్వీయ జనగణన ప్రారంభం: మే 10 వరకు గడువు.



**వనపర్తి జిల్లా పెన్ సత్తా, ఏప్రిల్ 26:**వనపర్తి, జనగణన-2027లో భాగంగా జిల్లాలో శనివారం నుంచి సెల్ఫ్ ఎన్యుమరేషన్ ప్రారంభమైంది. ప్రజలు మే 10 వరకు ష్ట్రజూం://ఒవ.ఎవఅంబం.స్త్రశీజ.ఱఅ వెబ్‌సైట్‌లో తమ వివరాలు నమోదు చేసుకోవచ్చు.
ఎమ్మెల్యే మేఘారెడ్డి, కలెక్టర్ ఆదర్శ్ సురభి తొలిరోజే నమోదు చేసుకున్నారు. 33 ప్రశ్నలకు సమాధానం ఇచ్చాక వచ్చే ూజు ×఑ ని సేవ్ చేసుకుని, మే 11 తర్వాత ఇంటికి వచ్చే సిబ్బందికి చూపించాలి
అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ మాట్లాడుతూ జిల్లాలో 1086 మంది ఎన్యుమరేటర్లను నియమించామని, ప్రజల సమాచారం గోప్యంగా ఉంటుందని తెలిపారు. ప్రజలంతా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు

## శ్రీ వాసవి కన్యాకాపరమేశ్వరి అమ్మవారి జయంతి ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి



**వనపర్తి జిల్లా: పెన్ సత్తా, ఏప్రిల్ 26:**తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికార పండుగగా ప్రకటించిన సందర్భంగా వనపర్తి జిల్లా కలెక్టరేట్‌లో శ్రీ వాసవి కన్యాకాపరమేశ్వరి అమ్మవారి జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి హాజరయ్యారు. అనంతరం వనపర్తి పట్టణంలోని శ్రీ వాసవి కన్యాకా పరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి జయంతి వేడుకల్లో పాల్గొన్నారు.
ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి సుధీర్ రెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, ఆర్యవైశ్య సంఘం నాయకులు, ఇతర ప్రజా సంఘాల ప్రతినిధులు, అధికారులు, సిబ్బంది, యూత్ కాంగ్రెస్ నాయకులు, కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పోలీసులపై తిరగబడిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు జైలుకు తరలింపు

**పెన్ సత్తా, ఏప్రిల్ 26:**బజార్హత్నూర్ లోని ముత్యంపేట కాలనీలో తేదీ 24/04/2026 సాయంత్రం 05:00 గంటలకు వడ్డెర కమ్యూనిటీకి చెందిన ఇరువర్గాలు గొడవ పడుతున్నారని 100 డయల్ రాగా గొడవ ఆపడానికి తక్షణమే అక్కడికి వెళ్ళిన పోలీసులపై ఇరువర్గాలలోని ఇద్దరు వ్యక్తులు ఇత్తారి రాజేష్ ూ/శీ రాజన్న 30 సంవత్సరాలు మరియు ధారంగుల దుర్గేష్ ూ/ఓ రాములు 25 సంవత్సరాలు పోలీసులపై దురుసుగా ప్రవర్తిస్తూ చేతులతో తోసివేసి, కొట్టడమే కాకుండా ఇక్కడి నుండి వెళ్లకపోతే చంపుతామని బెదిరించడంతో పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసి జైలుకు తరలించడమైనదని అంతేకాకుండా మద్యం మత్తులో గొడవ పడుతూ ప్రజాశాంతికి భంగం కలిగించిన ఇరువర్గాలలోని ఆరుగురు వ్యక్తులపై కేసు నమోదు చేయనైనదని బజార్ హత్నూర్ ఎస్ఐ గారు జి రమేష్ తెలపనైనది





# మెడిసిన్ ప్యాకెట్స్‌పైన ఉండే ఎర్రని గీతకు అర్థం ఏంటో
# 90 శాతం మందికి తెలియదు.. మీకు తెలుసా..?




ఏదైనా అనారోగ్యానికి గురైనపుడు డాక్టర్ సలహా మేరకు లేదా.. నేరుగా మెడికల్ స్టోర్ నుంచి మందులు కొంటుంటా. కానీ.. మెడిసిన్స్ ప్యాకెట్స్ పైన ఉండే రెడ్ స్ట్రిప్ (ఎర్రని చార) గురించి అంతగా గమనించం. చూసినా ఏదో డిజైన్ కోసం అనుకునే వాళ్లే ఎక్కువ. చాలా మందికి ఆ లైన్ ఎందుకు ఉంటుందో తెలియదు. దాని మీనింగేంటో చూద్దాం.

వాస్తవానికి రెడ్ స్ట్రైప్స్ అనేవి ప్రభుత్వం ఇచ్చే సిరియస్ వార్నింగ్ సింబల్స్. దాన్ని మరిచిపోవడం హెల్త్ కు డేంజర్ మాత్రమే కాదు.. బాడీలో డ్రగ్ రెసిస్టెన్స్ పరిస్థితి

ఏర్పడే ప్రమాదం ఉంటుంది. డ్రగ్ రెసిస్టెన్స్ అంటే మందులు అలవాటైన తర్వాత.. కొన్నాళ్లకు ఆ మందులు మన బాడీకి పనిచేయకపోవడం. అందుకే దీని గురించి తెలుసుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది.

**రెడ్ లైన్ అర్థమేంటి..**

మెడిసిన్ పైన రెడ్ స్ట్రిప్ ఉందంటే.. ఆ మందులు డాక్టర్ ప్రిస్క్రిప్షన్ ఉంటే తప్ప కనటానికి, అమ్మటానికి వీలు లేదు

రెడ్ లైన్ ఉందంటే దాదాపు యాంటి బయాటిక్స్ ఉన్నట్లు. అనవసరంగా వాడితే డ్రగ్ రెసిస్టెన్స్ ప్రాబ్లమ్ ఎదుర్కోవాల్సి ఉంటుంది

ఏ కెమిస్ట్ రెడ్ స్ట్రిప్ ఉన్న మెడిసిన్ ను డైరెక్టుగా అమ్మరు. అలా అమ్మటం చట్ట పరంగా నేరం.

**ఎందుకు ఈ రెడ్ లైన్ ముఖ్యం:**

జలుబు వంటి చిన్న కారణానికి కూడా జనాలు యాంటీ బయాటిక్స్ వాడుతుంటారు. సొంత చికిత్సను నివారించేందుకు ఈ లైన్స్ వేస్తుంటారు.

రెడ్ స్ట్రిప్ సింబల్ ఉన్న మెడిసిన్ హెవీ డోస్ వేసుకుంటే కిడ్నీ, లివర్, అలర్జీ సమస్యలు వచ్చే ప్రమాదం ఉంటుంది

ఈ మందులు ఎన్నాళ్లు వాడాలో డాక్టర్ డిసైడ్ చేస్తారు. అదే విధంగా ఎంత

మోతాదులో తీసుకోవాలో కూడా వైద్యులు నిర్ధారిస్తారు. అలా కాకుండా సొంతంగా వేసుకుంటే తీవ్ర ప్రమాదాలు ఎదురవటం ఖాయం.

**మందులు కొనే ముందు ఇవి గుర్తించుకోండి:**

Rx అనే లేబుల్ తో పాటు రెడ్ స్ట్రిప్ ఉంటే.. డాక్టర్ ప్రిస్క్రిప్షన్ తప్పనిసరి. చీ=ఇ ఉంటే అది నార్కోటిక్ డ్రగ్ అని అర్థం. నార్కోటిక్ డ్రగ్స్ అంటే నొప్పిని నివారించి.. నిద్రను ప్రేరేపించేవి. వీటికి అలవాటు పడితే మెల్లగా బానిలసయ్యే ప్రమాదం ఉంటుంది

మెడిసిన్ పైన ఉండే స్ట్రిప్ ను చెక్ చేయడంతో పాటు తయారీ డేట్, ఎక్స్ పైరీ తేదీలను కూడా గమనించండి.

**సలహా:**


ఎర్ర గీత ఉన్న మందులను ఇతరుల సలహా మేరకు గానీ లేదా పాత ప్రిస్క్రిప్షన్ ఆధారంగా గానీ ఎప్పుడూ కొనవద్దు.ఒకవేళ డాక్టర్ ఎర్ర గీత ఉన్న మందును సూచించినట్లయితే, లక్షణాలు తగ్గిన తర్వాత కూడా పూర్తి కోర్సును వాడటం మంచిది.

# నో రెజ్యూమె.. 10 నిమిషాలు మాట్లాడి సెలెక్ట్ చేస్తారు..
# బెంగళూర్ కంపెనీ హైరింగ్ విధానం వైరల్?




జాబ్ ఏదైనా.. రెజ్యూమె లేకుండా దాదాపు ఏ ఇంటర్వ్యూ ఉండదు. ఉద్యోగంలోకి తీసుకునే ముందు సీవీ చూసి అందులో ఉన్న డీటెయిల్స్, క్వాలిఫికేషన్స్, ఎక్స్?పీరియెన్స్.. మొదలైన అంశాలు పరిగణనలోకి తీసుకుని క్యాండెట్ ను సెలెక్ట్ చేస్తుంటారు కదా. కానీ ఈ కంపెనీ ఫౌండర్ మాత్రం కాస్త డిఫరెంట్. రెజ్యూమ్ చూసి ఒక్కరిని కూడా హైర్ చేసుకోలేదని చెప్తున్నారు. ఈ పద్ధతి గురించి ఇప్పుడు సోషల్ మీడియాలో డిబేట్ నడుస్తోంది. ఈజ్?మైఎక్స్?పో ఫౌండర్ విక్రమాదిత్య శుక్లా .. రెజ్యూమె లేకుండా ఇంటర్వ్యూ చేసే విధానంతో ఫేమస్ అయ్యారు. క్యాండిడేట్ ఎక్స్ పీరియెన్స్ బేస్ చేసుకుని.. రిస్ట్రిక్టెడ్ క్లోజ్డ్ రూమ్?లో చేసే హైరింగ్ విధానం తనకు నచ్చదని చెబుతున్నారు. ఆయన ఎక్స్ లో చేసిన పోస్ట్ వైరల్ గా మారింది. 10 నుంచి 15 నిమిషాల అన్ స్ట్రక్చర్డ్ కన్వర్జేషన్స్ ద్వారానే క్యాండెట్ ను సెలెక్ట్ చేసుకుంటాడట. దీని కోసం ముందుగా క్వశ్చన్స్ ప్రిపేర్ చేయడం లాంటిది ఏదీ ఉండదు. డైరెక్ట్ గా ఆ సమయంలో ఆ ఫ్లోలో జరిగే సంభాషణలోనే క్యాండిడేట్ ను డిసైడ్ చేసుకుంటాడట. నేనెప్పుడూ రెజ్యూమె ఆధారంగా ఎంప్లాయ్స్ ను తీసుకోలేదు. కంపెనీకి ఎవరైనా ఇంటర్వ్యూ కోసం వస్తే.. 10 – 15 నిమిషాలు మాట్లాడుతూ స్పెండ్ చేస్తా. అందుకోసం స్ట్రక్చర్డ్ క్వశ్చన్స్ అంటూ ఉండవు. దీనికోసం ఎలాంటి ఫ్రేమ్ వర్క్ ఉండదు. నా ఎక్స్ పెక్టేషన్స్ కు మ్యాచ్ అయితే సెలెక్ట్ చేసుకుంటా అంటూ ట్వీట్ చేశాడు. ఈ ట్వీట్ వైరల్ గా మారింది. అయితే దీనికి స్కేలబులిటీ, ఆబ్జెక్టివిటీ గురించి చాలా మంది యూజర్లు ప్రశ్నిస్తున్నారు. ప్రొఫెషనల్ ఎక్స్ పీరియెన్స్ ను ఇగ్నోర్ చేసినట్లేనని అంటున్నారు. కానీ కొందరు ఈ విధానం బాగుందని అభినందిస్తున్నారు. స్టార్టప్ సెట్టింగ్స్ లో ఒక వ్యక్తి పర్సనాలిటీని జడ్జ్ చేయడంలో ఇది బాగా ఉపయోగపడుతుందని కామెంట్స్ చేస్తున్నారు.

# వాస్తు దోషం ఏర్పడేందుకు కారణాలుఏంటి..!
# స్థలం.. ప్లాట్ కొనే ముందు తెలుసుకోవలసినవి ఇవే..!




చిన్న ఆరోగ్యసమస్య వచ్చినా.. ఆర్థిక సమస్యలు వచ్చినా.. ఉద్యోగం...కష్టాలు ఇలా ఏది వచ్చినా వెంటనే జ్యోతిష్య పండితులను.. వాస్తు పండితులను సంప్రదిస్తాం. వాస్తుశాస్త్రం ప్రకారం... ఇల్లు కట్టిన తరువాత కాదు.. ఇంటి స్థలం కొనే విషయంలో కూడా చాలా వాస్తు నియమాలున్నాయి. ఇదంతా ఏమీ పట్టించుకోకుండా అందిన ధరకు వస్తుంది కదా అని ప్లాట్.. ఇంటి స్థలం కొంటారు.. మనలో చాలామంది ఇల్లు కట్టుకున్న తర్వాతో, ఫ్లాట్ కొనుక్కున్న తర్వాతో వాస్తు దోషాలున్నాయేమోనని వాస్తు పండితులను సంప్రదిస్తారు. అసలు వాస్తు దోషాలు ఏర్పడటానికి ముఖ్యంగా మూడు కారణాలు ఉంటాయని పండితులు చెబుతున్నారు. మొదటిది ఇంటి స్థలాన్ని కొనే ముందే అన్ని కోణాలలో భూమి పరీక్ష చేయించాలి. ఎందుకంటే లూజ్ సాయిల్ అయితే ఇల్లు కట్టుకోవటానికి అనువైందికాదు. కట్టడం బలంగా వుండదు. అలాగే నేల అడుగున దేవాలయాలు, జల నాడులు, శల్యాలు, దుష్ట శక్తుల ఆవాహన వున్న ప్రదేశాలలో కూడ ఇల్లు కడితే సుఖంగా వుండలేరని వాస్తు పండితులు చెబుతున్నారు. అలాగే చుట్టుపక్కల ఎలా వుంది. చెరువులు.. గుట్టలు ఉన్నాయి.. అవి మనం తీసుకొనే స్థలానికి ఎటువైపున ఉన్నాయి. ఇరుగూ, పొరుగూ ఏమేమి ఉన్నాయి.. మొదలటు విషయాలను క్షుణ్ణంగా పరిశీలించి ముందుగానే వాస్తు పండితులను సంప్రదించి నిర్ణయానికి రావాలని వాస్తు పండితులు అంటున్నారు. రెండవది యజమాని నామ నక్షత్రాన్ని బట్టి ఇంటికి సింహ ద్వారాలు ఎక్కడ వుండాలి, ఎన్ని గుమ్మాలు వుండాలి, ఎక్కడెక్కడ వుండాలి, కిటికీలు ఎక్కడ వుండాలి వగైరాలన్నీ ముందే వాస్తు పండితులను సంప్రదించి నిర్ణయించుకోవాలి. ఇవ్వన్నీ చూపించినా కొన్నిసార్లు ఆ ఇంట్లో నివసించిన తర్వాత వాస్తు బాగాలేదనుకుంటారు. దానికి కారణం మన ప్రవర్తనవల్ల వచ్చింది. ఏ ఇంట్లో అయితే స్త్రీలకు అన్యాయం జరుగుతుందో, ఏ ఇంట్లో అనర్ధాలు జరుగుతాయో, ఆక్రందనలుంటాయో ఆ ఇంటికి వాస్తు దోషం వుంటుందంటారు.

జీవ హింస జరిగే ఇంట్లో, తల్లిదండ్రులు, , బాధపడే ఇంట్లో వాస్తు దోషం వున్నట్లే. అంటే ఆ ఇంట్లో నివసించే వారికి సుఖశాంతులు వుండవు. సర్ప, దేవతా, ఋషి శాపాలు వున్న ఇంట, పసిపిల్లలకు అన్యాయం జరిగే ఇంట వాస్తు దోషం వున్నట్లేనని వాస్తు శాస్త్రంద్వారా తెలుస్తుంది. ఇవ్వన్నీ భూమి ఎంచుకునేటప్పుడు, ఇల్లు కట్టుకునేటప్పుడు వచ్చిన దోషాలుకాదు. మన ప్రవర్తనవల్ల వచ్చిన దోషాలు.

అలాగే కొందరు ఇల్లు కట్టాక వాస్తుకోసమని కొంత భాగం పడగొట్టి మార్పులు చేర్పులు చేస్తూవుంటారు. అలా చెయ్యటంకూడా వాస్తుదోషమేనని వాస్తు పండితులు చెబుతున్నారు.


భూమిలోను, ఇంట్లోను దోషాలుంటే ఆ ఇంటిని మారిస్తే సరిపోతుంది. మన ప్రవర్తనలో దోషం వుంటే మనం ఏ ఇంటికెళ్ళినా ఆ ప్రవర్తన మారకపోతే తిప్పలు తప్పవు. ఎంత బాగా వాస్తు ప్రకారం కట్టిన ఇల్లయినా కలసిరాదు. అందుకే ముఖ్యంగా మన ప్రవర్తనని సరి చేసుకోవాలి. అప్పుడు ఏ ఇంట్లోనైనా సంతోషంగా ఉంటారని వాస్తు పండితులు చెబుతున్నారు.

### అంబానీల కోటలో పాప్ సింగర్ రిహన్నా..
## పెద్ద పండగే చేశారుగా..!



పాప్ సింగర్ రిహన్నా అంబానీల ఇంటిని సందర్శించారు. ముంబై ట్రిప్ లో భాగంగా ఆదివారం (ఏప్రిల్ 26) అంటీలియా సౌధానికి చేరుకున్నారు. ఆమె కాస్మటిక్ బ్రాండ్ ఫెంటీ బ్యూటీ (Fenty Beauty) లాంచ్ సందర్భంగా అంబానీల ఆతిథ్యం స్వీకరించారు. రిహన్నా రాకతో రాకతో పెద్ద వేడుకే నిర్వహించారు. ఇషా అంబానీ, శ్లోకా మెహతా, రాధికా మర్చంట్, అనంత్ అంబానీ లు.. రిహన్నాను అంటిలియా సౌధంలోకి స్వయంగా ఆహ్వానించారు. సంప్రదాయ నృత్య ప్రదర్శనతో ఆమెను ఇంట్లోకి తీసుకెళ్లారు. పూలు వెదజల్లుతూ ఆమెకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అంబానీ ఫ్యామిలీ నిర్వహించిన హారతి పూజలో పాల్గొన్నారు రిహన్నా ఆమె టీమ్. ప్రత్యేకంగా నిర్వహించిన పూల హోళీ అతిథులను అలరించింది. ఆ తర్వాత ప్రత్యేకంగా భారతీయ వంటకాలతో ఏర్పాటు చేసిన లంచ్ లో పాల్గొన్నారు. ఈవెంట్ కు సంబంధించిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. డ్యాన్స్ ఫూటేజ్, ఇతర క్లిప్స్ కు మంచి స్పందన వస్తోంది. థ్యాంక్యూ ని హిందీలో ఎలా చెప్పాలి అని రిహన్నా అడిగే వీడియో.. రెడ్ కార్పెట్ పై ఫోటోకు ఫోజులిస్తున్న క్లిప్ వైరల్ అవుతున్నాయి.

### బ్యాంకింగ్ లోనూ డిఫరెంట్ థింకింగ్..
## డిజిటల్ వాలెట్లకే ప్రయారిటి



జెన్ జీ బ్యాంకుల కంటే డిజిటల్, ఫాస్ట్ పే ఎక్స్‌పీరియెన్స్‌కే ఎక్కువగా ప్రయారిటీ ఇస్తున్నారు. తమ బ్యాంకింగ్ అలవాట్లలోనూ కొత్తదనం తీసుకొస్తున్నారు. వాటిలో మొదటిది మల్టిపుల్ బ్యాంకింగ్ రిలేషన్ షిప్స్.. జెన్ జీలో సుమారు 60% మంది తమ ఆర్థిక కార్యకలాపాలను ఒకే బ్యాంకుకు పరిమితం చేయకుండా పలు ప్రొవైడర్ల మధ్య డిస్ట్రిబ్యూట్ చేస్తున్నారు. సగటున ప్రతి ఒక్కరూ రెండు బ్యాంకులు, రెండు డిజిటల్ వాలెట్లను ఉపయోగిస్తున్నారు. రెండోది ప్రైమరీ బ్యాంక్ మార్పు.. జెన్ జీలో 20% మంది రాబోయే ఆరు నెలల్లో తమ ప్రధాన బ్యాంకును మార్చుకునే అవకాశం ఉందని చెప్తున్నారు. ఇకపోతే.. గత ఏడాదిలో మూడింట ఒక వంతు జెన్ జీ, మిలీనియల్ కస్టమర్?లు మెరుగైన సేవల కోసం తమ ప్రైమరీ బ్యాంకును మార్చేశారు. ముఖ్యంగా యూత్ లోన్?ల కోసం ట్రెడిషనల్? పద్ధతుల కంటే నిమిషాల్లో అప్రూవల్ ఇచ్చే యాప్‌లనే ఎక్కువగా నమ్ముతున్నారు. అంతేకాదు.. సుమారు 42% మంది జెన్ జీ కస్టమర్?లు ప్రస్తుత బ్యాంకుల డిజిటల్ ఇంటర్‌ఫేస్ సంతృప్తికరంగా లేదని భావిస్తున్నారు. మెరుగైన డిజిటల్ ఎక్స్?పీరియెన్స్? కోసం 82% మంది తమ ప్రస్తుత బ్యాంకును వదులుకోవడానికి సిద్ధంగా ఉన్నారు. జెన్ జీ కేవలం తక్కువ చార్జీలు లేదా ఎక్కువ వడ్డీ కోసం మాత్రమే కాకుండా, తమ పర్సనల్ వ్యాల్యూస్, సామాజిక బాధ్యతతో సరితూగే బ్యాంకులను ఎంచుకుంటున్నారు. వీళ్లు కేవలం డబ్బును దాచుకోవడమే కాకుండా ఖర్చులను ట్రాక్ చేయడానికి, ఇన్వెస్ట్ చేయడానికి యాప్ లోనే టూల్స్ వెతుకుతున్నారు. ఇదిలా ఉంటే, 45% మంది జెన్ జీ కస్టమర్?లు ఫిజికల్ బ్రాంచ్‌లు లేని బ్యాంకుల్లో అకౌంట్ తెరవడానికి ఇష్టపడటం లేదు. ముఖ్యమైన సలహాల కోసం వారు నేరుగా కలవాలని కోరుకుంటున్నారు. బ్యాంకులు తమ ట్రెడిషనల్ పద్ధతులను మార్చుకోకపోతే, ఈ కొత్త తరం కస్టమర్లను కోల్పోయే ప్రమాదం ఉంది. కేవలం ఒక బ్యాంకులో ఖాతా ఉండటం కంటే, బెస్ట్ ఎక్స్?పీరియెన్స్ ఇచ్చే ప్లాట్?ఫామ్?లకే జెన్ జీ ఓటు వేస్తున్నారు.

## నెలకో రాకెట్ తయారీ.. త్వరలో నింగిలోకి విక్రమ్-1.. స్కైరూట్ ఏరోస్పేస్ వెల్లడి




**హైదరాబాద్, :** భారత అంతరిక్ష రంగంలో సరికొత్త చరిత్ర సృష్టించేందుకు హైదరాబాద్‌కు చెందిన స్టార్టప్ 'స్కైరూట్ ఏరోస్పేస్' సిద్ధమైంది. వచ్చే ఏడాది నాటికి నెలకు ఒక రాకెట్ తయారు చేసి ప్రయోగించే స్థాయికి చేరుకుంటామని సంస్థ సీఈఓ పవన్ ?కుమార్, కో--ఫౌండర్ నాగ భరత్ వెల్లడించారు. దేశంలోనే తొలి ప్రైవేట్ ఆర్బిటల్ రాకెట్ 'విక్రమ్–1'ను ఈ ఏడాది జూన్‌లో ప్రయోగించే అవకాశం ఉందని తెలిపారు. ఈ రాకెట్ భాగాలను శ్రీహరికోటకు తరలించే ప్రక్రియను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్?రెడ్డి శనివారం ప్రారంభించిన సందర్భంగా వీళ్లు మీడియాతో మాట్లాడారు. ఇది తొలి ప్రయోగం కాబట్టి కేవలం కొన్ని పరికరాలు, సెన్సర్లతో టెస్ట్ లాంచ్ నిర్వహిస్తామని, తదుపరి ప్రయోగాల్లో పూర్తిస్థాయి వాణిజ్య ఉపగ్రహాలను పంపిస్తామని వెల్లడించారు. ఈ రాకెట్ తయారీలో 90 శాతం కంటే ఎక్కువ భాగాలను భారత్‌లోనే సేకరించామని చెప్పారు. గ్లోబల్ ఇన్వెస్టర్ల నుంచి ఇప్పటికే రూ.800 కోట్లకు పైగా (100 మిలియన్ డాలర్లు) సేకరించామని చెప్పారు. ప్రస్తుతం ప్రపంచ అంతరిక్ష మార్కెట్ విలువ 600 బిలియన్ డాలర్లు కాగా, 2035 నాటికి ఇది 1.8 ట్రిలియన్ డాలర్లకు చేరుకోవచ్చని పవన్? వివరించారు.

RNI:APTEL/2023/87729
పెన్ సత్తా
PEN SATTA Telugu Daily

# ఎడిటోరియల్

## నిగనిగలాడే మామిడిలో 'విషం'

**- వ్యాపారుల కాసుల కక్కుర్తితో నిబంధనలు ఉల్లంఘన**

ఫలాలన్నింటిల్లో రాజుగా మామిడి పేరొందింది. కొంతమంది వ్యాపారులు తమ స్వలాభం కోసం అత్యాశతో ప్రజారోగ్యంతో చెలగాటమాడుతున్నారు. దీనికితోడు అధికారుల నిర్లక్ష్యం సైతం ఒకింత కారణం కావడంతో మధురానుభూతిని కలిగి ఉండాల్సిన మామిడి ఫలాలు విషతుల్యంగా మారుతున్నాయి. మామిడి పక్వానికి రాకుండానే కాయలను విషపు రసాయనాలతో కృత్రిమంగా మాగబెడుతుండటం ఆందోళన కలిగించే అంశం. అన్నమయ్య జిల్లా కలికిరిలో ఇథలిన్ ఆధారిత కేంద్రంలో పండ్లను మూగబెట్టేటటువంటి అవకాశం ఉన్నప్పటికీ వ్యాపారులు వినియోగించకపోవడం గమనార్హం. దాంతో మామిడి కాయలు మూలకు చేరింది. కార్బైడ్?తో మాగినటువంటి పండ్లను తిన్నవారికి అనారోగ్య సమస్యలు వస్తున్నాయి. రాయచోటి కేంద్రంగా సాగుతున్న దందాను ఇప్పుడు తెలుసుకుందాం.

**మామిడి పండ్లలో భయంకర రసాయనాలు:** ప్రమాదకరపు రసాయనాలతో పక్వానికి వచ్చిన మామిడి పండ్లను తింటే దీర్ఘకాలిక సమస్యలు తప్పవని పలువురు వైద్యులు హెచ్చరిస్తున్నారు. వీటి ద్వారా కడుపులో పుండ్లు ఏర్పడటంతో పాటు కాలేయం, జీర్ణకోశపు వ్యవస్థలు దెబ్బతింటాయని అంతేకాకుండా క్యాన్సర్ వంటి భయంకర వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని అప్రమత్తం చేస్తున్నారు. అదే విధంగా కాళ్లు, చేతులు తిమ్మిర్లు రావడం, శరీరంపై మచ్చలు వస్తాయని వెల్లడిస్తున్నారు. వీటితోపాటు కాల్షియం కార్బైడ్ ద్వారా వెలువడేటటువంటి ఎసిటిలిన్ వాయువు నాడీ వ్యవస్థ మీద సైతం తీవ్ర ప్రభావం చూపుతుందని, దీని వల్ల తలనొప్పి, దీర్ఘకాలిక మత్తు, శక్తిని కోల్పోయే ప్రమాదం ఉంది. చిన్నారుల్లో వ్యాధి నిరోధక శక్తి తగ్గి శ్వాస సంబంధిత ఇబ్బందులు కూడా తలెత్తుతాయి. గర్భిణుల్లో హార్మోన్లు దారి తప్పుతాయని హెచ్చరిస్తున్నారు.

**జరిమానాతో పాటు జైలు శిక్ష:** ప్రధానంగా ఆహార సంరక్షణ ప్రమాణాల చట్టం- 2006 ప్రకారం కాల్షియం కార్బైడ్ ఇతర రసాయనాలతో మామిడి పండ్లను మాగబెట్టినప్పటికీ, విక్రయించినా ఏడాది పాటు జైలు శిక్షతో పాటు రూ. 3 లక్షల జరిమానా విధించే అవకాశం ఉంది. అయితే జిల్లాలో అధికారులు కొన్ని సంవత్సరాలుగా ఎక్కడా దాడులు నిర్వహించిన దాఖలాలు లేకపోవడం ఆశ్చర్యకరం. దాంతో ఇదే అదనుగా భావించిన విక్రయదారులు విచ్చలవిడిగా ప్రమాదకర రసాయనాలతో మాగబెట్టిన మామిడి పండ్లను విక్రయిస్తూ ప్రజల ఆరోగ్యంతో ఆడుకుంటున్నారు.

అంతేకాకుండా వ్యాపారులు పక్వానికి రాకముందే మామిడి కాయలను కోసేసి మండీలకు తరలించి కార్బైడ్, ఇతర ప్రమాదకర రసాయనాలను వినియోగించి పండ్లను మాగబెడుతున్నారు. అయితే ఈ మాగబెట్టిన వాటిని మార్కెట్లకు తరలించి విక్రయిస్తున్నారు. వీధి వ్యాపారులు, మండీల్లో నుంచి వీటిని తెచ్చుకుని వ్యాపారులు విక్రయాలను సాగిస్తూ అనారోగ్యాన్ని పంచుతున్నారు.

**తియ్యని పండ్ల వెనక ఉన్న చేదు నిజాలు**

ముఖ్యంగా 2011 ఆహార భద్రత ప్రమాణాల ప్రకారం ప్రభుత్వం కార్బైడ్, ఎసిటిలిన్ రసాయనాలను నిషేధించింది. సహజంగా పండించేటటువంటి ఇథలిన్?ను మాత్రమే 100 పీపీఎం వరకు వినియోగించేందుకు అనుమతులను ఇచ్చింది.

ప్రభుత్వం నిబంధనల ప్రకారం సుమారు 20 కిలోల పండ్లకు 5 గ్రాముల ఇథలిన్?ను వినియోగించాల్సి ఉంది వ్యాపారులు మేలిమి పండ్లుగా కనిపించేందుకు కార్బైడ్?ను వినియోగిస్తున్నారు. ఆమోదించిన ఇథలిన్?తో పోలిస్తే కార్బైడ్, ఇతర రసాయనాలు మార్కెట్?లో చౌకగా లభ్యమవుతాయి. అంతేకాకుండా ఈ పండ్లు తొందరగా మాగుతాయి. దీంతో వ్యాపారులు యథేచ్ఛగా కార్బైడ్?ను ఉపయోగిస్తున్నారు.

"కృత్రిమంగా మాగబెట్టినటువంటి పండ్లు తినడం వలన తీవ్ర అనారోగ్య సమస్యలు వస్తాయి. ఈ సీజన్లో వచ్చే మామిడి పండ్లను రంగును చూసి మోసపోకుండా నమ్మకమైన వారి వద్దనే కొనుగోలు చేయాలి. కార్బైడ్తో మాగబెట్టిన పండ్లను తినకపోవడమే ఉత్తమం. మార్కెట్ నుంచి తెచ్చిన ఏ మామిడి పండునైనా ఉప్పునీటితో శుభ్రంగా కడిగిన తరువాత తినాలి. ప్రజలందరూ స్వీయ జాగ్రత్తలు తీసుకోవడం తప్పనిసరి"-

# అధికంగా చెమట పట్టడం




చెమట పట్టడం శరీరం సహజంగా ఉష్ణోగ్రతను నియంత్రించుకునే విధానం. చర్మంలో ఉన్న స్వేద గ్రంథులు చెమటను ఉత్పత్తి చేస్తాయి. ఇవి శరీరం మొత్తం ఉన్నప్పటికీ నుదురు, చంకలు, అరచేతులు, పాదాలు వంటి భాగాల్లో ఎక్కువగా ఉంటాయి. చెమటలో నీరు మాత్రమే కాకుండా ఉప్పు కూడా ఉంటుంది. చెమట ఆవిరైపోతే చర్మం చల్లబడుతుంది, దీంతో శరీర ఉష్ణోగ్రత సమతుల్యంలో ఉంటుంది. అయితే చెమట కేవలం చల్లబరచడం మాత్రమే కాదు, అది ఆరోగ్యం గురించి కూడా ముఖ్యమైన సంకేతాలు ఇస్తుంది. చెమటను ఒక సైలెంట్ బయోమార్కర్ గా పరిగణిస్తారు. హార్మోన్ అసమతుల్యతల నుంచి మెటబాలిక్, న్యూరాలజికల్ సమస్యల వరకు అనేక గోప్యమైన ఆరోగ్య సమస్యలను ఇది తెలియజేస్తుంది. మొత్తం శరీరానికి చెమట పడితే..మొత్తం శరీరానికి అధికంగా చెమట పట్టడం (హైపర్హైడ్రోసిస్) ఒక హెచ్చరిక సంకేతంగా భావించాలి. చల్లని గదిలో లేదా విశ్రాంతి సమయంలో కూడా చెమట ఎక్కువగా పడితే, అది హైపర్థైరాయిడిజం, డయాబెటిస్, ఇన్ఫెక్షన్లు, మెనోపాజ్ లేదా లింఫోమా వంటి వ్యాధుల సూచన అయ్యే చాన్స్ ఉంటుంది. ఇలాంటి చెమట రోజువారీ జీవితాన్ని ప్రభావితం చేస్తే వైద్యుడిని సంప్రదించడం అవసరం. చేతులు, పాదాలు లేదా ముఖం వంటి నిర్దిష్ట ప్రాంతాల్లో మాత్రమే చెమట రావడం ఫోకల్ హైపర్హైడ్రోసిస్ గా పిలుస్తారు. ఇది సాధారణంగా ప్రమాదకరం కాకపోయినా, మానసిక ఒత్తిడి, ఆందోళనలతో సంబంధం ఉంటుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. కొందరిలో హార్మోన్ మార్పులు లేదా కొన్ని మందులు తీసుకోవడం వల్ల కూడా ఇది పెరుగుతుంది. రాత్రిపూట చెమటలు (నైట్ స్వెట్స్) ఒక ముఖ్యమైన సంకేతం. చల్లని వాతావరణంలో కూడా చెమటతో మెళకువ రావడం ట్యూబర్క్యులోసిస్ వంటి ఇన్ఫెక్షన్లు, థైరాయిడ్ సమస్యలు, మెనోపాజ్, లింఫోమా వంటి వ్యాధులను సూచించే అవకాశాలు ఉంటాయి. ఇది బరువు తగ్గడం, అలసట, జ్వరం వంటి లక్షణాలతో ఉంటే నిర్లక్ష్యం చేయకూడదు.తక్కువ చెమట పడితే..కొంతమందికి చెమట తక్కువగా పడుతుంది (అన్హైడ్రోసిస్). ఇది నరాల దెబ్బతినడం, చర్మ వ్యాధులు లేదా జన్యుపరమైన సమస్యల వల్ల అయ్యే అవకాశాలు ఉంటాయి. చెమట తక్కువగా పడితే శరీరం చల్లబడలేక హీట్ ఎగ్జాస్షన్, హీట్ స్ట్రోక్ ప్రమాదం పెరుగుతుంది. చెమట చాలా ఉప్పుగా ఉండటం లేదా చర్మంపై తెల్లటి మచ్చలు ఏర్పడటం అధిక ఎలక్ట్రోలైట్ నష్టాన్ని సూచిస్తుంది. ఎక్కువసేపు చెమట పట్టే వారు సోడియం లోపం (హైపోనాట్రేమియా) ప్రమాదంలో ఉంటారు. చెమట పట్టడం, గుండె వేగంగా కొట్టుకోవడం (పాల్పిటేషన్స్), ముఖం ఎర్రబడటం వంటి లక్షణాలు హార్మోన్ లేదా రక్తనాళ సమస్యలను సూచిస్తాయి. ఫియోక్రోమోసైటోమా వంటి అరుదైన ట్యూమర్లు లేదా హైపర్థైరాయిడిజం ఈ లక్షణాలకు కారణం అవుతాయి. ఇవి సాధారణంగా అధిక రక్తపోటు, తలనొప్పి, బరువు తగ్గడం వంటి లక్షణాలతో కూడి ఉంటాయి. చెమట వాసనలో మార్పులు కూడా అనారోగ్య సంకేతాలు అయ్యే అవకాశాలు ఉంటాయి. అసాధారణమైన, గట్టిగా ఉండే వాసన మెటబాలిక్ లేదా హార్మోనల్ మార్పులను సూచిస్తుంది. డయాబెటిస్ లేదా కిడ్నీ వ్యాధుల్లో లోహం లేదా అమోనియా వాసనలా అనిపిస్తుంది. కొన్ని మందులు లేదా ఇన్ఫెక్షన్లు కూడా చెమట వాసనను మారుస్తాయి. చెమటను నిర్లక్ష్యం చేయకుండా, దాని విధానంలో మార్పులను గమనించడం ద్వారా ఆరోగ్య సమస్యలను ముందుగానే గుర్తించవచ్చు. అవసరమైతే వైద్యుడిని సంప్రదించడం ఉత్తమం.

# వారాల పాటు ఈ గింజలను తినండి..



చిన్నగా కనిపించే ఒక సూపర్ ఫుడ్ శరీరంలో కేవలం రెండు వారాల్లో మార్పులు తీసుకురాగలదా? అవును, అది చియా గింజల వల్ల సాధ్యమే. పోషక విలువలతో నిండిన ఈ గింజల్లో ఫైబర్, ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్లు, ప్రోటీన్లు, యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయి. పరిమాణంలో చిన్నవైనా, ప్రతిరోజూ తీసుకుంటే ఆరోగ్యంపై పెద్ద ప్రభావం చూపిస్తాయి. నిపుణుల ప్రకారం, రోజూ ఒకటి లేదా రెండు టేబుల్ స్పూన్ల చియా గింజలను 14 రోజుల పాటు తీసుకుంటే జీర్ణక్రియ మెరుగుపడటమే కాకుండా శక్తి స్థాయిలు పెరగడం, హృదయ ఆరోగ్యం మెరుగుపడడం వంటి ప్రయోజనాలు పొందవచ్చు. వీటిలో ఉన్న అధిక ఫైబర్ గట్ (జీర్ణ వ్యవస్థ)లో మంచి బ్యాక్టీరియాను పెంచడంలో సహాయపడుతుంది. అలాగే నీటిని ఎక్కువగా శోషించుకునే గుణం ఉండటం వల్ల ఎక్కువసేపు ఆకలి లేకుండా ఉంచి రక్తంలో చక్కెర స్థాయిలను స్థిరంగా ఉంచుతుంది.జీర్ణక్రియ మెరుగుపడేందుకు..అలాగే జీర్ణక్రియ మెరుగుదల విషయంలో చియా గింజలు ముఖ్య పాత్ర పోషిస్తాయి. ఇవి ద్రవ్యంలో కరిగే ఫైబర్ను అధికంగా కలిగి ఉండటం వల్ల నీటిని పీల్చుకుని జెల్ రూపంలో మారుతాయి. దీంతో మలబద్ధకం తగ్గి, క్రమబద్ధమైన విసర్జనకు సహాయపడుతుంది. అంతేకాకుండా, గట్లోని మంచి బ్యాక్టీరియాకు పోషణను అందించి జీర్ణవ్యవస్థను బలోపేతం చేస్తాయి. అదేవిధంగా హృదయ ఆరోగ్యానికి కూడా చియా గింజలు మేలు చేస్తాయి. వీటిలో ఉన్న ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్లు, ద్రవ్యంలో కరిగే ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లు కలిసి చెడు కొలెస్ట్రాల్ (LDL) స్థాయిలను తగ్గించడంలో సహాయపడతాయి. దీని వల్ల గుండె సంబంధిత సమస్యల ప్రమాదం తగ్గుతుంది.షుగర్ లెవల్స్ తగ్గేందుకు..రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో కూడా ఇవి కీలకంగా పనిచేస్తాయి. చియా గింజలలోని ద్రవ్యంలో కరిగే ఫైబర్ జీర్ణక్రియను నెమ్మది చేస్తుంది. దీంతో కార్బోహైడ్రేట్ల శోషణ ఆలస్యమై, భోజనం తర్వాత రక్తంలో గ్లూకోజ్ ఒక్కసారిగా పెరగకుండా అడ్డుకుంటుంది. ఇక చియా గింజలను రాత్రంతా నానబెట్టి ఉదయం తీసుకోవడం ఉత్తమం. రోజుకు ఒకటి లేదా రెండు టేబుల్ స్పూన్ల చియా గింజలను నీరు లేదా పాలతో కలిపి తీసుకుంటే, వాటి పూర్తి పోషక ప్రయోజనాలను పొందవచ్చునని నిపుణులు సూచిస్తున్నారు.

# గ్లోకోమా లక్షణాలు ఇవే.. ముందుగా స్పందించకపోతే శాశ్వత అంధత్వం వచ్చే అవకాశం..



గ్లోకోమా ప్రపంచవ్యాప్తంగా శాశ్వత అంధత్వానికి ప్రధాన కారణాలలో ఒకటిగా నిలుస్తోంది. ప్రపంచంలో 80 మిలియన్లకు పైగా ప్రజలను ఇది ప్రభావితం చేస్తోంది. ముఖ్యంగా భారతదేశంలో గ్లోకోమా రోగులలో దాదాపు 90 శాతం మందికి ఇది ఉన్నట్లు కూడా తెలియకపోవడం ఆందోళనకర విషయంగా మారింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనాల ప్రకారం దృష్టి లోపాలలో దాదాపు 80 శాతం వరకు సరైన సమయంలో గుర్తిస్తే నివారించవచ్చు లేదా చికిత్స చేయవచ్చు. కానీ లక్షణాలు ఎక్కువగా కనిపించకపోవడం వల్ల చాలామంది తీవ్రమైన దృష్టి నష్టం జరిగిన తర్వాతే వైద్యులను సంప్రదిస్తున్నారు. గ్లోకోమా ఒకే ఒక్క వ్యాధి కాదు. ఇది కళ్లలోని ఆప్టిక్ నర్వ్‌ను (కంటి నుండి మెదడుకు సమాచారాన్ని పంపించే నాడి) ప్రభావితం చేసే వ్యాధుల సమూహం. సాధారణంగా కంటి లోపల ఒత్తిడి పెరగడం లేదా నాడికి సరైన రక్తప్రసరణ లేకపోవడం వల్ల ఈ నాడి క్రమంగా దెబ్బతింటుంది. వయస్సు పెరగడం ఒక ముఖ్యమైన ప్రమాద కారకం అయినప్పటికీ, శిశువులు, పిల్లలు, యువతలో కూడా ఈ వ్యాధి కనిపించే అవకాశం ఉంది. శమసక దృష్టి..గ్లోకోమా ప్రారంభ దశలో కనిపించే ముఖ్య హెచ్చరికలలో ఒకటి మసక దృష్టి. కంటిలో ఒత్తిడి పెరగడం వల్ల స్పష్టంగా కనిపించకుండా ఉండటం జరుగుతుంది. విశ్రాంతి తీసుకున్నా లేదా కళ్లద్దాలు మార్చుకున్నా మసక దృష్టి తగ్గకపోతే, వెంటనే కంటి నిపుణుడిని సంప్రదించడం అవసరం. ఇంకో ముఖ్య లక్షణం కాంతుల చుట్టూ వలయాలు కనిపించడం. ముఖ్యంగా రాత్రి సమయంలో లైట్ల చుట్టూ హాలోస్ కనిపించడం గ్లోకోమాకు సంకేతంగా భావించాలి. ఇది కంటి ఒత్తిడిలో మార్పులను సూచిస్తుంది, డ్రైవింగ్ వంటి పనుల్లో ఇబ్బందులను కలిగిస్తుంది. తలనొప్పులు కూడా గ్లోకోమాతో సంబంధం ఉండే అవకాశాలు ఉంటాయి. కంటిలో ఒత్తిడి పెరగడం వల్ల తరచుగా తలనొప్పి వస్తుంది. ఈ నొప్పి కొన్నిసార్లు స్వల్పంగా ఉండొచ్చు, కానీ కాలక్రమేణా తీవ్రంగా మారుతుంది.

టన్నెల్ విజన్ మార్పు..తలనొప్పితో పాటు దృష్టి మార్పులు లేదా కంటి అసౌకర్యం ఉంటే నిర్లక్ష్యం చేయకూడదు. కొన్ని రకాల గ్లోకోమాలో, ముఖ్యంగా యాంగిల్-క్లోజర్ గ్లోకోమాలో, కంటి నొప్పి తీవ్రంగా ఉంటుంది. ఇది గుచ్చినట్లుగా లేదా మంటగా అనిపిస్తుంది. ఇలాంటి తీవ్రమైన నొప్పి ఉంటే వెంటనే వైద్య సహాయం తీసుకోవడం అత్యవసరం. వ్యాధి ముందుకు సాగుతున్న కొద్దీ పక్కదృష్టి తగ్గిపోవడం కూడా గమనిస్తారు. దీనిని టన్నెల్ విజన్ అని పిలుస్తారు. దృష్టి పరిధి క్రమంగా కుచించుకుపోతూ చివరికి పూర్తిగా చూపు కోల్పోయే ప్రమాదం ఉంటుంది.వైద్య పరీక్షలు చేయించుకోవాలి..40 సంవత్సరాల పైబడినవారు, డయాబెటిస్ ఉన్నవారు, అధిక మైయోపియా ఉన్నవారు లేదా కుటుంబంలో గ్లోకోమా చరిత్ర ఉన్నవారు తప్పనిసరిగా కంటి పరీక్షలు చేయించుకోవాలి. కంటి ఒత్తిడి కొలత, ఆప్టిక్ నర్వ్ పరీక్షలు వంటి సమగ్ర పరీక్షలు చేయించడం ద్వారా వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించవచ్చు. త్వరగా గుర్తించడం ద్వారా చూపును కాపాడుకోవడం సాధ్యమవుతుంది. భారతదేశంలో అంధత్వాన్ని తగ్గించడానికి సమగ్ర చర్యలు అవసరం. గ్రామీణ ప్రాంతాల్లో కంటి పరీక్షలను అందుబాటులోకి తీసుకురావడం, కంటి వైద్య శిబిరాలు, మొబైల్ క్లినిక్‌లను ఏర్పాటు చేయడం ముఖ్యం. అలాగే కటారాక్ట్, గ్లోకోమా, డయాబెటిక్ రెటినోపతి వంటి వ్యాధులపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలి. తక్కువ ఖర్చుతో చికిత్సలు, కళ్లద్దాలు వంటి సదుపాయాలను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా ప్రజల కంటి ఆరోగ్యాన్ని రక్షించవచ్చని నిపుణులు చెబుతున్నారు.

# కోల్‌కతా వదల్లేదు

## స్వల్ప స్కోర్ల మ్యాచ్‌లో అద్భుత విజయం
## సూపర్‌ఓవర్లో ఓడిన లఖ్‌నవూ
## నరైన్ సంచలన బౌలింగ్
## రింకు అసాధారణ పోరాటం



మొదట కోల్‌కతా నైట్‌రైడర్స్ చచ్చీ చెడీ 155 పరుగులు చేసింది. లఖ్‌నవూ అలవోకగా ఆ లక్ష్యాన్ని ఛేదించేలా కనిపించింది. ఒక దశ వరకు ఆట సాగిన తీరు చూస్తే.. ఈ ఐపీఎల్‌లో అత్యంత బోరింగ్ మ్యాచ్‌ల్లో ఇదొకటనిపించింది. కానీ తర్వాత అనూహ్య మలుపులు తిరిగిన మ్యాచ్ సూపర్ ఓవర్‌కు దారి తీసి.. అందరి దృష్టినీ తనవైపు తిప్పుకుంది. పన్నెండేళ్ల కిందట కరీబియన్ లీగ్‌లో సూపర్ ఓవర్లో మెయిడెన్ వేసి సంచలనం సృష్టించిన సునీల్ నరైన్.. ఇప్పుడు ఐపీఎల్‌లో అద్భుతం చేశాడు. ఒక్క పరుగుకే రెండు వికెట్లు తీసి ఎల్‌ఎస్‌జీ ఓటమిని శాసించాడు. మ్యాచ్‌పై పూర్తిగా ఆశలు కోల్పోయిన స్థితిలో మేటి ఇన్నింగ్స్‌తో కోల్‌కతాకు పోరాడే స్కోరునందించిన రింకు అసలైన హీరో.

లఖ్‌నవూ: పేలవ ప్రదర్శన చేస్తోన్న లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌కు వరుసగా అయిదో పరాభవం. ఆదివారం ఉత్కంఠభరితంగా సాగిన మ్యాచ్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్ సూపర్ ఓవర్లో లఖ్‌నవూపై నెగ్గింది. రింకు (83 నాటౌట్; 51 బంతుల్లో 7ఐ4, 5ఐ6) ఆదుకోవడంతో మొదట కోల్‌కతా 7 వికెట్లకు 155 పరుగులు చేసింది. మోసిన్ ఖాన్ (5/23) అద్భుతంగా బౌలింగ్ చేశాడు. ఛేదనలో తడబడ్డ లఖ్‌నవూ కూడా 20 ఓవర్లలో 8 వికెట్లకు సరిగ్గా 155 పరుగులే చేసింది. పంత్ (42; 38 బంతుల్లో 4ఐ4, 1ఐ6), మార్‌క్రమ్ (31) రాణించారు. స్కోర్లు సమం కావడంతో సూపర్ ఓవర్ తప్పలేదు. అక్కడ లఖ్‌నవూ పూర్తిగా తేలిపోయింది. అద్భుతంగా బౌలింగ్ చేసిన నరైన్ ఒక్క పరుగే ఇచ్చి రెండు వికెట్లు పడగొట్టి, లఖ్‌నవూ ఇన్నింగ్స్‌ను ముగించాడు. మొదటి బంతికి పూరన్‌ను ఔట్ చేసిన అతడు.. మూడో బంతికి మార్‌క్రమ్‌ను వెనక్కి పంపాడు. ఛేదనలో తొలి బంతికే రింకు ఫోర్ కొట్టడంతో విజయం కోల్‌కతా సొంతమైంది. 8 మ్యాచ్‌ల్లో ఇది కోల్‌కతాకిది రెండో విజయం. ఎల్‌ఎస్‌జీకిది మొత్తంగా ఆరో ఓటమి.

**మోసిన్ ఖాన్ (5/23)**

లఖ్‌నవూ తడబాటు: లక్ష్యం చిన్నదే అయినా ఛేదనలో లఖ్‌నవూ పరుగుల కోసం చెమటోడ్చింది. రెండో ఓవర్లోనే మార్ష్ ఔటయ్యాక.. మార్‌క్రమ్, కెప్టెన్ పంత్ నిలబడ్డారు. కానీ కేకేఆర్ బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో బ్యాట్ ఝుళిపించలేకపోయారు. 10 ఓవర్లు ముగిసే సరికి స్కోరు 63 మాత్రమే. సాధించాల్సిన రన్‌రేట్ దాదాపు పదికి చేరుకుంది. ఆ దశలో మార్‌క్రమ్‌ను గ్రీన్ ఔట్ చేశాడు. పేలవ ఫామ్‌ను కొనసాగిస్తూ పూరన్ (9) కూడా వెంటనే నిష్క్రమించడంతో ఎల్‌ఎస్‌జీ ఛేదన మరింత కష్టంగా మారింది. 15వ ఓవర్లకు స్కోరు 92/4.

చివరి 5 ఓవర్లలో 64 పరుగులు చేయాల్సిన స్థితిలో ఎల్‌ఎస్‌జీపై ఒత్తిడి బాగా పెరిగిపోయింది. ఆపై ముకుల్ చౌదరి (1) ఇలా వచ్చి అలా వెళ్లాడు. కానీ ఆ స్థితిలో హిమ్మత్ (19) ఓ సిక్స్.. బదోని (24) రెండు సిక్స్‌లతో లఖ్‌నవూను రేసులో నిలిపారు. సాధించాల్సిన రన్‌రేట్ మరీ పెరిగిపోకుండా చూశారు. చివరి మూడు ఓవర్లలో లఖ్‌నవూకు 38 పరుగులు అవసరమయ్యాయి. అయితే ఊపు మీదున్న బదోనిని ఔట్ చేసిన వరుణ్.. 18వ ఓవర్లో 10 పరుగులిచ్చాడు. తర్వాతి ఓవర్లో అరోరా.. లిండ్ (8)ను వెనక్కి పంపి 11 పరుగులిచ్చాడు.

# సుదర్శన్ గెలిపించెన్



రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో మ్యాచ్.. సాయి సుదర్శన్ సెంచరీ కొట్టాడు.. గుజరాత్ భారీ స్కోరు చేసింది. కానీ ఆర్సీబీ మ్యాచ్‌ను ఎగరేసుకుపోయింది. సుదర్శన్ మళ్లీ కొట్టాడు. ఈసారి ఛేదనలో జట్టును గెలిపించే ఇన్నింగ్స్ ఆడాడు. మందకొడిగా ఉన్న పిచ్‌పై రబాడ విజృంభణతో చెన్నై అతి కష్టం మీద 158 పరుగులు చేస్తే.. అదే పిచ్‌పై లోకల్ బాయ్ సుదర్శన్ అదిరే ఇన్నింగ్స్‌తో టైటాన్స్ విజయంలో కీలకపాత్ర పోషించాడు. ఈ గెలుపుతో గుజరాత్ 8 పాయింట్లతో అయిదో స్థానానికి చేరింది. ఈ సీజన్లో పడుతూ లేస్తూ సాగుతున్న చెన్నై.. 8 మ్యాచ్‌ల్లో 5 ఓడి, 6 పాయింట్లతో ఆరో స్థానంలో కొనసాగుతోంది.

గుజరాత్ టైటాన్స్ గాడిలో పడింది. వరుసగా రెండు ఓటముల తర్వాత ఓ విజయాన్ని అందుకుంది. ఆదివారం ఆ జట్టు 8 వికెట్ల తేడాతో చెన్నై సూపర్ కింగ్స్‌ను చిత్తు చేసింది. మొదట చెన్నై 7 వికెట్లకు 158 పరుగులు చేసింది. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ (74 నాటౌట్; 60 బంతుల్లో 6ఐ4, 4ఐ6) టాప్ స్కోరర్. రబాడ (3/25) అదిరే ప్రదర్శన చేయగా.. అర్షద్ ఖాన్ (2/43), సిరాజ్ (1/23) కూడా ప్రత్యర్థి పతనంలో పాలుపంచుకున్నారు. సాయి సుదర్శన్ (87; 46 బంతుల్లో 4ఐ4, 7ఐ6) మెరుపులతో గుజరాత్ 16.4 ఓవర్లలో 2 వికెట్లే కోల్పోయి లక్ష్యాన్ని చేరుకుంది. శుభ్‌మన్ గిల్ (33; 23 బంతుల్లో 1ఐ4, 3ఐ6), బట్లర్ (39 నాటౌట్; 30 బంతుల్లో 4ఐ4, 1ఐ6) రాణించారు.గుజరాత్ కష్టపడకుండా..: ఛేదనలో గుజరాత్ అదరగొట్టింది. గత మ్యాచ్‌లో బెంగళూరుపై సెంచరీ చేసిన సాయి సుదర్శన్ మరోసారి సత్తా చాటాడు. ఇంకో ఓపెనర్ శుభ్‌మన్ గిల్ అండతో గట్టి పునాది వేసిన సుదర్శన్.. ఆపై బట్లర్ తోడుగా గుజరాత్‌ను విజయపథంలో నడిపించాడు. ఇన్నింగ్స్‌ను ధాటిగా ఆరంభించింది మాత్రం శుభ్‌మనే. హెన్రీ వేసిన తొలి ఓవర్లో 6, 4 బాదిన గిల్.. ఆ తర్వాత ఓవర్టన్ (3వ ఓవర్)కు సిక్స్ రుచి చూపించాడు. ఇదే ఓవర్లో సుదర్శన్ కూడా ఓ సిక్స్ బాదడంతో పవర్ ప్లే ఆఖరికి గుజరాత్ 55/0తో నిలిచింది. కుదురుకున్న గిల్‌ను నూర్ అహ్మద్ ఔట్ చేసినా..

గుజరాత్ ఏమీ తగ్గలేదు. సుదర్శన్, బట్లర్ ప్రశాంతంగా ఆడుతూ లక్ష్యాన్ని కరిగించారు. ఇదే క్రమంలో సుదర్శన్ 33 బంతుల్లో అర్ధసెంచరీ అందుకున్నాడు. తర్వాత అతను మరింత ధాటిగా ఆడాడు. హెన్రీ, గుర్జాప్‌నీత్ ఓవర్లలో రెండేసి సిక్స్‌లు బాది జీటీని విజయానికి మరింత చేరువ చేశాడు. హెన్రీ వేసిన 17వ ఓవర్లో బ్రెవిస్ పట్టిన ఓ మెరుపు క్యాచ్‌కు సుదర్శన్ వెనుదిరిగినా.. అదే ఓవర్లో బట్లర్ ఓ సిక్స్ బాది ఛేదనను పూర్తి చేశాడు. 20 బంతులు మిగిలుండగానే గుజరాత్ గెలిచింది.

# జాన్వీ లుక్: ఆ నడుము మడతలో దాగిన హొయలు



నేటితరం కథానాయికల్లో జాన్వీ కపూర్ ఒక తిరుగులేని –షో స్టాపర్–గా దూసుకుపోతోంది. ఫ్యాషన్ సెన్స్ విషయంలో ఈ బ్యూటీని కొట్టేవాళ్లే లేరని చెప్పడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. తాజాగా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వైట్ అండ్ వైట్ ఫ్రాక్ లుక్ లో జాన్వీ ఎంతో అందంగా కనిపిస్తోంది. ముఖ్యంగా బ్యాక్‌లెస్ ఫోజులతో కుర్రకారులో గుబులు పుట్టిస్తోంది. పట్టీల ఫ్రాకులో జాన్వీ నడుము మడతలు నిజంగా గుబులు పుట్టిస్తున్నాయి.. జాన్వీ ఫోజులు ఇప్పుడు నెట్టింట హాట్ టాపిక్‌గా మారాయి.

కెరీర్ ప్రారంభంలో –ధడక్– సినిమాతో వెండితెరకు పరిచయమైనప్పుడు జాన్వీ నటన – లుక్స్ గురించి నెగటివ్ కామెంట్స్ చేసిన వారు కూడా ఇప్పుడు తన అద్భుతమైన ఫ్యాషన్ సెన్స్‌కి ఫిదా అయిపోతున్నారు. కాలక్రమేణా గ్లామర్‌ను మెరుగుపరుచుకుంటూ ఫ్యాషన్ ప్రపంచంలో తనకంటూ ఒక ప్రత్యేక ముద్ర వేసుకుంది. బికినీలో ఘాటైన పోజులు ఇచ్చినా.. స్విమ్ సూట్‌లో మెరిసినా లేదా స్టైలిష్ బ్లేజర్‌లో ప్రొఫెషనల్ లుక్‌లో కనిపించినా జాన్వీ శైలి అద్భుతంగా ఉంటుంది.కేవలం వెస్ట్రన్ దుస్తుల్లోనే కాకుండా.. సాంప్రదాయక చీరకట్టులోనూ జాన్వీ అచ్చమైన భారతీయ నారిలా కనిపిస్తుంది. అటు మోడ్రన్ గ్లామర్.. ఇటు డివోషనల్ లుక్.. ఇలా ఏ వేషధారణలోనైనా జాన్వీ ఒదిగిపోయే తీరు అభిమానులను మంత్రముగ్ధులను చేస్తోంది. ఎప్పటికప్పుడు తన ఇన్‌స్టాగ్రామ్ వేదికగా కొత్త ఫ్యాషన్ ట్రెండ్స్‌ను పరిచయం చేస్తూ మిలియన్ల కొద్దీ ఫాలోవర్లను సంపాదించుకుంటోంది. ఈ వైట్ ఫ్రాక్ లుక్ కూడా జాన్వీలోని గ్లామర్ కోణాన్ని మరోస్థాయికి తీసుకెళ్లింది.



ప్రస్తుతం జాన్వీకపూర్ టాలీవుడ్‌లోనూ సత్తా చాటుతోంది. –దేవర– సినిమాతో తెలుగు ప్రేక్షకులకు చేరువైన ఈ ముద్దుగుమ్మ.. ఇప్పుడు గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ సరసన –పెద్ది– (బుచ్చిబాబు సానా చిత్రం)లో నటిస్తోంది. ఈ భారీ ప్రాజెక్టులో జాన్వీ పాత్ర ఎలా ఉండబోతోందనే ఆసక్తి అందరిలోనూ నెలకొంది. ఈ చిత్రంలో జాన్వీ ఒక విభిన్నమైన గ్లామరస్ రోల్‌లో కనిపిస్తుందని సమాచారం. జాన్వీ గ్లామర్ యాటిట్యూడ్ కి మెగా ఫ్యాన్స్ కిల్ అవ్వడం ఖాయం.గ్లామర్ ఎలివేషన్ టాలెంట్ తో పాటు తన అద్భుతమైన ఫ్యాషన్ సెన్స్‌తో సౌత్ – నార్త్ సినీ ఇండస్ట్రీలను జాన్వీ ఏకకాలంలో ఏలేస్తోంది. వైట్ డ్రెస్‌లో తను షేర్ చేసిన లేటెస్ట్ ఫోటోలు ఫ్యాషన్ ప్రియులకు ఒక విజువల్ ట్రీట్‌గా నిలిచాయి. ఈ బ్యూటీ తన తదుపరి చిత్రం –పెద్ది–తో బాక్సాఫీస్ వద్ద రికార్డులు సృష్టించాలని అభిమానులు కోరుకుంటున్నారు.

PENSATTA TELUGU DAILY Printed, Published, Owned by CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 ,Publishe at D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 . And Printed at Chaitanya Vaaradhi printers, Do.No 2-99 Bharanikam, Paravada Anakapalli, Visakhapatnam- 531 021. Editor: CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 , Cell: 99853 15759, RNI. No APTEL/2023/87729, E-mail:anilchinthamneni@gmail.com